# శుభారంభం

(కర్మ సిద్ధాంత పరిచయం)

దృక్పధం మారితే దానికి తగినట్లుగా మొత్తం మారిపోవటం ఈ విశ్వంలో ఉన్న కీలక అంశం. అప్పుడు చెట్టు, పుట్ట, పిట్ట, కట్టె అన్నీ కూడా తమ భాషలో ఎన్నో విషయాలు నిశ్శబ్ధంగా చెబుతూనే ఉంటాయి. మారిన మనస్సుకు ప్రకృతి భాష తెలుస్తూనే ఉంటుంది. దారిన పోతుంటే చెవినబడే సంభాషణలో కూడా కొత్త అర్ధాలు స్ఫురిస్తాయి. రోజూ సాధారణంగా కనిపించే మనుషులలో కూడా అసాధారణ విషయాలు వెల్లడవుతాయి. భావాలకు పరిశుద్ధత తోడైతే సంపూర్ణానందానికి తలుపులు తెరుచుకుంటాయి.

* * *


పుట్టిన ప్రతి శిశువూ దైనందిన జీవితంలో స్వీయ పరిశుభ్రతకు సంబంధించిన అలవాట్లు ఏ విధంగా తల్లి దండ్రుల నుండి నేర్చుకుంటున్నారో, "కర్మ సిద్ధాంతం" గురించి కూడా అలాగే నేర్చుకోవాలి. అలా పెద్దలనుండి పరంపరగా పిల్లలు నేర్చుకోవాలంటే నేటి తరానికి ముఖ్యంగా నవతరం భార్యాభర్తలకు "కర్మసిద్ధాంతం" గురించిన అవగాహన, ఉపయోగం ఖశ్చితంగా తెలిసి ఉండాలి. అలా తెలుసుకోవటానికి "ప్రశ్నలు - జవాబుల" రూపంలో రాయబడిన "కర్మ సిద్ధాంత పరిచయ" పుస్తకమే ఈ "**శుభారంభం**".

* * *

కొంతమంది జీవితాలకు ఇది "శుభారంభం" కావాలనే శుభసంకల్పంతో ఈ పుస్తకానికి ఆ పేరు పెట్టాను. ఇలాంటి ఒక పుస్తకం అవసరంగా భావించిన విశ్వం నా చేత రాయించి, సాటివారికి ఈ విధంగా కృతజ్ఞతలు చెప్పే అవకాశం నాకు కల్పించింది. ఇది ఎవరు చదవాలో ఇప్పటికే "విశ్వం" నిర్ణయించి ఉంటుంది.


**- చండిక సాంబశివరావు**


NIYA AND NIHAL PUBLICATIONS
wwww.niyaandnihal.com



NIYA AND NIHAL PUBLICATIONS
wwww.niyaandnihal.com




Cover 2nd page ART PAPER

# శుభారంభం

## (కర్మ సిద్ధాంత పరిచయం)

జ్యోతిషరత్న

**చండిక సాంబశివరావు**

M.A. Litt., M.A. Astrology

**నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్**

**3-663/3, ఫ్లాట్ నం. ఎ4, ప్రగతి ఎన్‌క్లేవ్,**

**ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం,**

**గుంటూరు - 522 501**

సెల్ నెం.: + **91 7893930585**

E-Mail : niyaandnihal@gmail.com

Book 1st Page

ప్రథమ ముద్రణ : ఏప్రియల్ 2016

ప్రతుల సంఖ్య : 2000

ప్రచురణ : నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్

© శ్రీ చండిక సాంబశివరావు

**వెల : 60/-**

**ప్రతుల కొఱకు :**

**నియా అండ్ నిహాల్ పబ్లికేషన్స్**

3-663/3, ఫ్లాట్ నం. ఎ4, ప్రగతి ఎన్‌క్లేవ్,
ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం,
గుంటూరు - 522 501
సెల్ నెం.: **+ 91 7893930585**
E-Mail : niyaandnihal@gmail.com

డి.టి.పి.
**శైలజ, హైదరాబాద్**

ముద్రణ : కృష్ణ ప్రింటర్స్
హైదరాబాద్



# అంకితం



శ్రీ కత్తిక పాండు రంగారావు–శ్రీమతి కత్తిక సుందరి (బాబాయి – పిన్ని)

సుదీర్ఘమైన ఈ జీవిత ప్రయాణంలో
పుణ్య దంపతులైన మా బాబాయి, పిన్ని నాకు అందించిన
సహకారం చిరస్మరణీయం.
అందుకే వారికి ఈ "శుభారంభం"

**– చండిక సాంబశివరావు**

Blank



## SPECIAL THANKS TO

**Sri Madala Sudhakar**

**CMD, Janachaitanya Group of Companies**



Blank



# కృతజ్ఞతలు

**ఈ పుస్తకం నేను అమెరికాలో ఉండగా రాశాను.**

2016 మార్చి 12వ తేదీ ప్రారంభించి మార్చి 21వ తేదీ నాటికి పూర్తి చేశాను. కేవలం పది రోజుల సమయం పట్టిందని పైకి కన్పిస్తున్నప్పటికీ, దీని వెనకాల ఐదు మాసాల అంతర్మధనం ఉంది. సమాజంలోని జాతి బ్రాహ్మణులు (బ్రాహ్మణ జాతిలో జన్మించిన వారు జాతి బ్రాహ్మణులు) అందరూ కర్మ బ్రాహ్మణులు (పౌరోహిత్యం, అర్చకత్వం, యజ్ఞాలు చేయడం, ప్రవచనాలు చెప్పడం ఇత్యాది కర్మలు చేసేవారు కర్మ బ్రాహ్మణులు) గాక పోయినప్పటికీ, గుణ బ్రాహ్మణులుగా చెప్పుకోదగినవారు వీరిలోనే ఎక్కువ మంది ఉన్నారని నా వ్యక్తిగత అనుభవంతో విశ్వసిస్తున్నాను. (గుణ బ్రాహ్మణులు అనగా ఇతరుల శ్రేయస్సు కోరుతూ, కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తూ దైవ పూజలు, పితృ తర్పణాలు, పరోపకార సేవలు, దాన ధర్మాలు లాంటి సాత్విక గుణాలు కలిగి సాత్విక కర్మలు చేసేవారు). మిగిలిన మూడు వర్ణాల వారు సత్వగణం అభివృద్ధి చేసుకుని ఇప్పుడిప్పుడే గుణ బ్రాహ్మణుని స్థాయికి ఎదిగే క్రమంలో ఉన్నారు.

ఈ కారణాల వలన అసలు కర్మ సిద్ధాంతం తెలియకుండానే జీవితం తెల్లారిపోతున్న అనేక మందికి ఏ విధంగా "కర్మ సిద్ధాంతం" తెలియజేయాలి? పుస్తకం రాస్తేమాత్రం వాళ్ళు చదువుతారా? ఒకవేళ చదివినా వాళ్ళకు అర్థం అవుతుందా? అర్థం కానప్పుడు అసలు నేను రాయటమెందుకు? ఇప్పటికి ఉన్న కర్మ సిద్ధాంత గ్రంథాలు చదివి అందరూ అర్థం చేసుకోలేరు. కాబట్టి నా పుస్తకం అలా ఉండకూడదు.

పిట్ట కథలు మిశ్రమం చేసి రాస్తే, అసలు విషయం మరుగునపడి, కథలు మాత్రమే గుర్తుంటాయి. ఈ రకమైన అంతర్మధనంతో "అసలు రహస్యం" పేరుతో ఒకటి, "జననం నుండి మరణం వరకు" పేరుతో మరొకటి పుస్తకాలు రాయటం ప్రారంభించి మధ్యలోనే విరమించాను. ఈ అంతర్మధనానికి తోడు అనారోగ్యం.

శరీరంలో చక్కెర శాతం అధికమై ఇబ్బంది పడుతున్న తరుణంలో హైదరాబాద్ శ్రీకృష్ణ దేవరాయనగర్‌లో ఉండే డయాబిటీస్ స్పెషలిస్టు డాక్టర్ రఘు గారు నాకు ఫోన్ ద్వారా వైద్య సేవలందించారు. ఈ విధంగా ఈ కొత్త పుస్తకం **శుభారంభం** రూపుదిద్దుకోవటానికి పరోక్షంగా కారణమైన మిత్రులు డాక్టర్ రఘు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

మొదట రాసిన పుస్తకాలలో కొన్ని పేజీలు హైదరాబాద్‌లోని మిత్రుడు శ్రీ చివుకుల సుందరపార్వతీశంకు, చెన్నై లోని మా బంధువు శ్రీ బండి సాంబశివరావు గారికి పంపించాను. వారు కూడా అంతగా సంతృప్తి చెందకుండా ఇంకా బాగా రాస్తే మంచిదని సూచించారు. వారి సలహా మేరకు అప్పటి వరకు రాసిందంతా ఉపసంహరించుకొని, మరలా కొత్తగా ఈ పుస్తకం రాశాను. నేను ఏమి అనుకున్నానో ఆ విధంగా "**శుభారంభం**" రూపు దాల్చింది. వారిరువురికీ నా ఆత్మీయ కృతజ్ఞతలు.

కుటుంబ సభ్యుల సహకారం లేకుండా మనం ఏ పనీ చేయలేమన్నది నిర్వివాదాంశం. నా కుటుంబసభ్యులైన భార్య లక్ష్మీ ప్రసూనకు, కుమారుడు కృష్ణ చైతన్యకు, కోడలు వీణకు కృతజ్ఞతలు. నా మనుమరాలు చిరంజీవి నియ మనుమడు చిరంజీవి నిహాల్‌కు ఆశీస్సులతో కూడిన కృతజ్ఞతలు.

హైదరాబాదులో 35 సంవత్సరాలు నివసించిన నేను గత సంవత్సరం ఉండవల్లి సెంటరుకు వచ్చి ఇక్కడే ఉంటున్నాను. ఇక్కడకు వచ్చాక కూడా నాకు ఆత్మీయులు చాలా మంది ఏర్పడ్డారు. వారిలో ముఖ్యంగా మెడికల్ షాపు వాసు గార్కి, హెడ్‌మాష్టర్ రమణమూర్తి గార్కి, రత్నాకర్ గార్కి, మురళీకృష్ణ గార్కి, టైపు మాష్టారు శ్రీ గుంటి వెంకటనారాయణ గార్కి, వందే గోమాతరం పత్రిక వ్యవస్థాపకులు శ్రీ శర్మ గార్కి మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, ఉండవల్లి సెంటర్ బ్రాంచి సిబ్బందికి, తాళ్ళాయి పాలెం శివ స్వామి గార్కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నేను అమెరికాలో ఉండగా ఇండియాలో నా వ్యవహారాలు పర్యవేక్షించిన మా బంధువు శ్రీ అమిరెడ్డి వెంకట సత్యనారాయణ గార్కి నా ఆత్మీయ కృతజ్ఞతలు.





మాకు బంధువులు మరియు ప్రస్తుతం మాకు పొరుగున ఉన్న చిట్టి, లక్ష్మీ దంపతులకు సహకార కృతజ్ఞతలు. ఇటీవల చిట్టిపాలెంలో మా అమ్మ సంవత్సరీకం జరుపుకోవటానికి తమ స్థలం ఇచ్చిన మా ఆత్మీయ బంధువు శ్రీ చండిక ఆంజనేయ నాగేశ్వర రావు (బాబు బాబాయి) గార్కి హృదయపూర్వక కృతజ్ఞతలు.

మిత్రుడు డాక్టరు బొల్లు నాగేశ్వర రావుకు, బొల్లు బాబ్జికి కృతజ్ఞతలు. వైజాగ్‌లో రియల్ ఎస్టేట్స్ వ్యాపారం చేస్తున్న శ్రీ శ్యామల రావు గార్కి, రిట్జ్ హొటల్ యజమాని మిత్రలు శ్రీ తాళ్ళూరి సత్యనారాయణ గార్కి ప్రేమపూర్వక కృతజ్ఞతలు.

ఇంకా మా అమ్మ తరుపు బంధువులకు, నాన్న తరుపు బంధువులకు, నా భార్య తరుపు బంధువులకు, మరియు కోడలు తరుపు బందువులకు అందరికీ కృతజ్ఞతలు.

ప్రస్తుతం నా ఆదాయ వనరులకు కారణమవుతున్న శ్రీ మిరియాల అమరేశ్వర రావుకు, శ్రీ గరికపాటి రమేష్‌కు, శ్రీ వి.ఆర్. ప్రసాద్‌కు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

పుస్తకాల పంపిణీకి సహకరిస్తున్న మిత్రుడు శ్రీ మంగపతి రావుకు వేలాది కృతజ్ఞతలు. మా ఇంట్లో మేము కోరిన విధంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ గణపతి పూజారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

చివరగా ఈ పుస్తకాన్ని అందంగా ప్రింటు చేయించి ఇచ్చిన శ్రీ మామిడి కృష్ణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇట్లు

చండిక సాంబశివరావు

విచిట, యూ.ఎస్.ఏ.

తేది. 21-03-2016



Gowthama Buddah

here onward Book Matter Starts

# ఈ పుస్తకం మన అందరి కోసం

"జ్ఞానం అనంతమైనది" చాలా కాలం క్రితం తొలిసారిగా ఈ వాఖ్యం చదివినప్పుడు నాకు ప్రత్యేకంగా ఏమీ అన్పించలేదు. నాకున్న కొద్దిపాటి తెలివిని బట్టి జ్ఞానం బాగా పెద్దది లేదా గొప్పది అని మాత్రం అర్ధమైంది. కాని తెలుసుకోవటం ప్రారంభించాక, ఏరోజుకారోజు, ఏగంటకాగంట, ఎప్పటికప్పుడు, అప్పటివరకూ తెలియని కొత్త సంగతులు తెలుస్తున్న కొద్దీ మనస్సు సంభ్రమాశ్చార్యాలకు గురవుతూనే ఉంది. సంవత్సరాలు గడుస్తున్నాయిగాని, ఈ "తెలుసుకోవటం" ఎంతకూ తెమలటం లేదాయే! తెలుసుకున్నది గోరంత, తెలియవలసింది కొండంతని, మరో వందేళ్లు గడచినా ఈ ప్రహసనానికి అంతుండదని మాత్రం తెలిసింది. అప్పుడర్థమైంది "జ్ఞానం అనంతమైనది" అనే వాఖ్యానికి అసలు సిసలైన అర్థం.

లౌకిక జ్ఞానం, ఇంగిత జ్ఞానం, తార్కిక జ్ఞానం, శాస్త్ర జ్ఞానం లాంటి జ్ఞానాలు ఎన్నో ఉన్నప్పటికీ అసలైన జ్ఞానం "ఆధ్యాత్మిక జ్ఞానం" అనే విషయం నాకు తెలిసే సరికి 60 ఏళ్లు నిండాయి. తనకు తాను తెలుసుకోవటమే అసలు సిసలైన జ్ఞానం. ఈ జ్ఞానం అనేది ఎవరికి వారు కృషి చేసి అంతులేని సంయమనంతో సాధన చేసి తెలుసుకోవలసిన అంశం ఐనప్పటికీ, దీనియొక్క ప్రాముఖ్యత ఆవశ్యకత గురించి అవగాహన లేకుండా ఎవరైనా ఆ దిశగా ఎలా ప్రయత్నిస్తారన్పించింది.

జ్ఞానం అనే మాట విశ్వమంత పెద్దదైనప్పటికీ, ఇది అర్థం గావటానికి అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానం అందించగల మాధ్యమం "కర్మ సిద్ధాంతం" మాత్రమే. ఇది ఎంతో విశిష్టమైనదే గాక సులభంగా అర్థం చేసుకుని, అంగీకరించి ఆచరించటానికి అనువైనదికూడా!

"కర్మ సిద్ధాంతం" గురించి అనేక మంది పుణ్య పురుషులు వివిధ గ్రంధాలలో తెలియజేసినప్పటికీ, ఆ సారాంశం కాల్పనిక సాహిత్యం లాగా



**శుభారంభం** – కర్మ సిద్ధాంత పరిచయం

పాఠకులందరినీ ఆకట్టుకోలేకపోయింది. ఫలితంగా భారతీయులందరూ నెత్తిన పెట్టుకుని పూజించాల్సిన ఈ సిద్ధాంతం ఒక వర్గం లేదా మతం యొక్క నమ్మకం స్థాయిలోనే ఉండిపోయింది. నిజానికి సర్వమత సారాంశం అంతా ఒక్కటే ! పాత్రలు, కథనాలు, ప్రదేశాలు వేరయినప్పటికీ అంతిమంగా అందరు చెప్పేది ఒక్కటే; మంచికి మర్యాద, చెడుకు శిక్ష. నిప్పు పట్టుకోవటం కారణమయితే, చేయి కాలటం కార్యం లేదా పరిణామం. కార్యాకారణ సంబంధం వివరించేది కర్మ సిద్ధాంతం.

కర్మ సిద్ధాంతం గురించి సాధారణ పాఠకులకు సైతం అర్థంగావాలని "మానవ సంబంధాలు మాయా బంధాలు" అనే పుస్తకం రాశాను. ఇందులో మానవ సంబంధాలకు కర్మను లింకు చేసి "ప్రశ్న–జవాబు" ల రూపంలో విశ్లేషించాను. ఆసక్తిగలవారు ఈ పుస్తకం కూడా పరిశీలించవచ్చును.

ఇప్పుడు కర్మ సిద్ధాంతం గురించి తెలియకపోతే వచ్చిన నష్టం ఏముంది? నాలుగు డబ్బులు సంపాదించటం ముఖ్యం కదా అని మీలో ఎవరైనా ప్రశ్నించవచ్చును.

డబ్బు ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి చిన్న పిల్లలకు కూడా తెలుసు. ఎందుకంటే పెద్ద వాళ్లం మనకు తెలుసు కాబట్టి మన నుండి పిల్లలు పెరుగుతూ అంచలంచలుగా నేర్చుకుంటారు. కాని కర్మ జ్ఞానం మనకే తెలియనపుడు పిల్లలకు ఎలా నేర్పించగలం? డబ్బు ఒక్కటే ఉంటే చాలని మనం ఊరుకోవటంలేదు కదా! పిల్లలకు నడక, మాటలు నేర్పించటంతో పాటు, మల మూత్ర విసర్జన, స్నానం, దుస్తులు ధరించటం లాంటి కీలకమైన విషయాలు నేర్పిస్తున్నాము గదా! ఇదిగో ఇలా పుట్టిన ప్రతి శిషువు దైనందిన జీవితంలో స్వీయ పరిశుభ్రత గురించిన అలవాట్లు ఏ విధంగా తల్లిదండ్రుల నుండి నేర్చుకుంటున్నారో, "కర్మ సిద్ధాంతం" గురించి కూడా అలాగే నేర్చుకోవాలి. అలా పెద్దల నుండి పరంపరగా నేర్చుకోవాలంటే నేటి తరానికి కర్మ సిద్ధాంతం

గురించిన అవగాహన, ఉపయోగం కచ్చితంగా తెలిసి ఉండాలి. మన జీవితంలో జరిగే ప్రతి సంఘటన, సమస్త మానవ సంబంధాలు "కర్మ సిద్ధాంతం" పరిధిలోకే వస్తాయి.

కర్మ సిద్ధాంతం యొక్క విస్తృత ప్రయోజనాలు జనులందరికీ ఎఱుక పరచాలని, తద్వారా తర్వాత కాలంలో మానవులందరూ వారివారి ఆసక్తి మేరకు "మోక్షం" కోసం జ్ఞానాన్వేషణ చేస్తారని, ఇప్పుడు మీ చేత చదివించి "మన జీవిత కథ మనం రాసుకున్నదే !" అనే విశ్వాసం ప్రబలంగా కల్గించటమే ధ్యేయంగా కొనసాగిన భావాల సమాహారమే ఈ పుస్తకం. మనందరి నమ్మకాలు, అభిప్రాయాలు పరిణితి చెందాక హృదయం విశాలమయ్యే సరికి ఆలోచనా విధానమే సంపూర్ణంగా మారిపోతుంది. భావాలు స్వచ్ఛంగా, తాజాగా సువాసనలు విరజిమ్ముతూ ఆవిర్భవిస్తాయి. పాప భీతి పెరిగి అందరూ ధర్మంగా నడుచుకోవటం వలన సమాజమే పెద్ద సత్సంఘంగా తయారయి, ఆకలి, అలజడి దోపిడి, దౌర్జన్యం లాంటి సామాజిక రుగ్మతలు రూపు మాసిపోయి ఏదో ఒకనాటికి భారత దేశమంతా వసుదైక కుటుంబంగా ఆవిర్భవిస్తుంది. ఇదే కొత్త బంగారు లోకం.

నేను మీ వాడిని అని మీరు ఒప్పుకుంటే కొంచెం నా మీద ప్రేమ కల్గుతుంది. తద్వారా నా మాటలపై శ్రద్ధ పెరుగుతుంది. నా పలుకులలోని అంతరార్థం గ్రహించగల్గుతారు. మీ జీవితంలో మీరు సాధించాననుకుంటున్న విజయాలు, అందుకున్న శిఖరాలు, డబ్బు, పరపతి, ఆస్థి అంతస్తులు, అధికారం, ప్రశంసలు – ఒక పట్టాన ఎదుటి వ్యక్తి చెప్పేది పూర్తిగా విననివ్వకుండా అడ్డు పడ్తాయి. ఒకవేళ మీరు సాత్విక స్వభావం కలిగి ఇతరుల పట్ల దయ, సహకారం, మానవత్వం, ప్రేమ ఉన్నట్లయితే, మీవిగా భావించబడిన సమస్తమూ ఈ విశ్వం నుండి మీరు కానుకలుగా పొందారని మీరు గ్రహిస్తారు. ఇంకా మీరు సంశయంలో ఉన్న యెడల కనీసం విషయాల లోతులలోకి వెళ్లి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి. అనంతమైన భావాలు వెలిబుచ్చటానికైనా





అర్థం చేసుకోవటానికైనా "భాషే" ఆధారం. ఆ భాషకు అక్షరాలు తెలుగు ఐతే 56, ఇంగ్లీషుకైతే 26. అంటే చాలా స్వల్పమన మాట. ఈ అక్షర జ్ఞానమే అనంతమైన జ్ఞానానికి ఆరంభం కదా! ఇదిగో నేను రాస్తున్న ఈ పుస్తకం కూడా భావికాలంలో మీలో జ్ఞాన జిజ్ఞాసను రేకెత్తించటానికి ఉపయోగపడే "అక్షరాభ్యాసం" గా భావిస్తున్నాను.

మన జీవనశైలిలో సాంకేతికత, వేగం చోటుచేసుకుని మహోనీయుల మనోహరమైన ఉదాత్త జ్ఞాన గ్రంథాలు సైతం చదువరులను అంతగా ఆకట్టుకోలేక "పుస్తకం" వెనుకబడిన ప్రస్తుత నేపథ్యంలో ఈ పుస్తకం మాత్రం ఎవరు చదువుతారు?

అందువలన పాఠకులకు నేను చెప్పదలచిన విషయాల మీద ఆసక్తి కలిగించటానికి, ఈ పుస్తకంలో పలు విధాలుగా ప్రయత్నించాను. ఈ ప్రారంభ అధ్యాయం ద్వారా, ప్రశ్నోత్తరాల ద్వారా, కల్పిత కథ ద్వారా, శీర్షికల ద్వారా, సూత్రాల ద్వారా కొద్ది కొద్దిగా చెప్పాను. ఇది మీకు ఉపయోగంగా అన్పించిన యెడల మరో నలుగురికి ఈ పుస్తకం గురించి చెప్పండి.

విచిట, కెన్సాస్, యూ.ఎస్, ఏ. ఇట్లు

తేది. 12-03-2016 చండిక సాంబశివరావు

**ప్రశ్న : మనిషి మెదడు ఎంతో శక్తివంతమైనదని, దాన్ని సవ్యంగా ఉపయోగించుకుంటే సాధించలేనిదంటూ ఏమీ లేదని, జీవితంలో ఏమీ సాధించలేని నిరాశావాదులు మాత్రమే "కర్మ సిద్ధాంతం" మాట్లాడతారని వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చే నిపుణులు అంటున్నారు. మానవుడే మహనీయుడు, శక్తిపరుడు యుక్తిపరుడు మానవుడే మహనీయుడు అనే సినీ గీతం కూడా ఉంది. దీనికి మీరేమంటారు?**

**జవాబు :** "మీరు ఏమైనా చేయగలరు. ఏమి అనుకుంటే అది సాధించగలరు. కోట్లు సంపాదించటం చాలా సులభం" అని క్లాసులు పెట్టి ఊదరగొట్టే వ్యక్తిత్వ వికాస శిక్షణా నిపుణుడు కోట్లు సంపాదించటం అంత సులభం అయినప్పుడు అదేదో తన స్వంతానికి సంపాదించుకోకుండా ఈ ఉపన్యాసాలు ఎందుకని ఎప్పుడైనా ఆలోచించారా? అంటే ఉత్సాహపరిచే నాలుగు మాటలు చెప్పడం తప్పని నేను అనటం లేదు. అలా "ఉపన్యసించటాన్ని" డబ్బు సంపాదించటానికి ఒక మేలైన మరియు తనకు చేతనైన మార్గంగా నిర్ణయించుకుని, ఈ వృత్తిని తన జీవనోపాధిగా అతను ఎంచుకున్నాడని మీరు అర్థం చేసుకోవాలి. ఇంతకంటే అతను "బెటర్" చేయగల్గితే, అతను ఈ మాటలు చెప్పే వృత్తిలో ఉండనే ఉండడు గదా!

ప్రతి ఉత్పాదక వ్యవస్థలో "గురు" అంశ ఉన్న వారు కొందరు ఉంటూనే ఉంటారు. వారే అక్కడి పని చేసే వారిని ప్రోత్సాహక మాటలతో ఉత్తేజపరుస్తుంటారు. ఈ ఏర్పాటు అన్ని కార్యాలయాలలోను అంతర్భాగంగా లేదా అంతర్లీనంగా ఉంటుంది. రైతు వారి వ్యవస్థలో కూడా కొందరికి "గురు" అంశ ఉండి కొంచెం నీరుగారిపోయిన వారిని బుజం తట్టి, అక్కడున్న పరిస్థితులకు తగినట్లుగా మరల జన జీవనశైలికి సమాయాత్తం చేసేవారు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, మనది పాంచ భౌతిక శరీరం. విశ్వంలో ఉన్న అగ్ని, భూమి, వాయు, జల, ఆకాశ తత్వాలు మనలోను ఉన్నాయి. వాతావరణం మారినట్లే మనలోనూ నిరంతరం భావాలు నిలకడగా





లేకుండా మారుతూనే ఉంటాయి. అలాగే మనందరిలోనూ సత్వ, రజో, తమో గుణాలు ఉన్నాయి. ఈ కారణంగా ఎంతటి ప్రతిభావంతుడైనా తామసిక గుణం ప్రకోపించినపుడు సోమరిగా మందకొడిగా తయారవుతాడు. అలా తాత్కాలిక నిద్రమత్తు ఆవరించిన వాళ్ళను నాలుగు మాటలు చెప్పి నిద్రలేపటం లాంటిదే ఈ వ్యక్తిత్వ వికాస శిక్షకులు చేసేపని. కాకపోతే ఒకప్పుడు సమాజంలో ఈ పని స్వచ్ఛందంగా చేసేవారు. మారిన సామాజిక పరిస్థితులలో కొంతమంది దీనిని ఉపాధిగా ఎంచుకున్నారు. ముందే చెప్పినట్లుగా ఈ శిక్షణ నాలుగు ప్రోత్సాహక మాటలు చెప్పటానికే అనే విషయం అనుక్షణం గుర్తుంచుకోవాలి. వినేవాడు చెప్పేవాడికి లోకువన్నట్టు ఈ నిపుణులు కొందరు నిబద్ధతను అతిక్రమించి అతిగా మాట్లాడుతున్నారు.

***కాబట్టి "డబ్బు" సంపాదించటానికి ఏదో ఒక వృత్తి తద్వారా ఆదాయం–ఇదే ఎవరు డబ్బు సంపాదించటానికైనా ప్రాథమిక మార్గంగా అర్థం చేసుకుని అంగీకరించాలి.***

ఆకర్షణ సిద్ధాంతం ప్రకారం "డబ్బు" మనం కోరుకుంటే వస్తుందని ఇటీవల పుస్తకాలలో ఊదరగొడ్తున్నారు. మీ జీతం నెలకు పది వేలైనా పర్వాలేదు, మీరు కోట్లు కావాలనుకుంటే అసాధ్యం కాదని, కేవలం కోరుకోవటమొక్కటే మీరు చేయవలసిందని చాలా నమ్మకంగా, ఆకర్షణీయంగా తన రచనా శైలి ద్వారా చెప్పటం వలన, ఆ పుస్తకం బాగా అమ్ముడయి రచయిత్రి చాలా డబ్బు గడించింది. తాయెత్తు కట్టుకుంటే కలసి వస్తుందని నమ్మటం లాంటిదే, ఇది కూడా.

"మేము హృదయపూర్వకంగా కోరుకుంటున్నాం కాని మా ఆర్థిక పరిస్థితి కొంచెం కూడా మెరుగవలేదు ఎందువలన?" అని నన్ను చాలా మంది ప్రశ్నించారు. చందమామ కథలో చదివినట్లు రెక్కల గుర్రాలు, పగడాల దీవులు ఉన్నాయని నమ్మటానికి ఎంతో బాగుంటుంది. అన్నట్లు ఇది ఒక సినిమా పాటగా కూడా వచ్చింది. ఇలాంటి వాటిని విని మనసుని

రంజింపజేసుకుని ఆనందించాలేగాని, వాస్తవాలని నమ్మకూడదు.

ప్రారబ్ధ కర్మ కారణంగా మన జన్మ ఏర్పడింది. అంటే తల్లి దండ్రులు, తోబుట్టువులు, పుట్టిన ప్రదేశం, కుటుంబ పరిస్థితులు, మనం పెంచబడిన పరిసరాలు, మనకు తిన బెట్టిన ఆహార పానీయాలు, మనకు నేర్పించిన అలవాట్లు నమ్మకాలు, భయాలు – ఏవీ మన చేతుల్లో లేవు. ఊహ తెలియని నాటినుండి మన వ్యక్తిత్వ నిర్మాణం మీద మనకు ఏమాత్రం అదుపు లేదు. కాస్త బుద్ధి వికసించి విషయాలు అర్ధమయ్యేసరికి, పెళ్లి పిల్లలు వెరసి సగం జీవితం తెల్లారిపోతుంది.

మన జీవితం మన ఎంపిక అనేది లేకుండా పాతిక సంవత్సరాలు గడచిపోయి, స్వీయ అనుభవాల ముద్రలు, బాల్య స్మృతులు, ఒకవేళ వైఫల్యాలు చవిచూసి ఉంటే వాటి తాలూకు జ్ఞాపకాలు మనసు మీద తప్పకుండా ఉంటాయని మీరూ అంగీకరిస్తారుగా! మరి అలాంటప్పుడు మీ స్వీయ అనుభవాలు చెరిపేసి, పుస్తకాలలో చెప్పిన విధంగా కొత్త ఆలోచనలను ఎలా ముద్రించగలరు? అంటే ఏదైనా ఎవరికైనా జీవితంలో మంచి మార్పు రావాలంటే తనను తాను సవ్యంగా అర్ధం చేసుకోవాలి. అప్పుడే జీవితంలో జరిగిన అనేక అంతుబట్టని సంఘటనలను అర్ధం చేసుకోగలుగుతారు. ఇదంతా కర్మ సిద్ధాంతం సంపూర్ణంగా వంటబట్టించుకుని, గణిత సూత్రాల్లా స్వయంగా పరిశీలించుకుని, స్వంత జీవిత పుటల్లోని సంఘటనలతో సరిపోల్చుకున్న తర్వాత మీరే అవునంటారు. ***అంతెందుకు చరిత్రను క్రీస్తు పూర్వము, క్రీస్తు తర్వాత అని కొలిచినట్లే, ఏ మనిషైనా తనకు కర్మ సిద్ధాంతం తెలియక ముందు, కర్మ సిద్ధాంతం తెలిసిన తర్వాత – అని తనను తాను కొలుచుకోగల్గుతాడు.*** అప్పుడు ఒక పుస్తకం చదివినా, ఒక వ్యక్తిత్వ వికాస ఉపన్యాసం విన్నా, ఒక సినిమా చూసినా, ఎవరితోనైనా మాట్లాడినా, "ఏది ఏమిటి" అని స్పష్టంగా సమంగా తెలుస్తూ ఉంటుంది. ఇతరుల ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుని పోకుండా, మాటల ఇంద్ర జాలంతో బంధీ గాకుండా, నిర్మల తటాకం అడుగున ఉన్న



**శుభారంభం** – కర్మ సిద్ధాంత పరిచయం

ఇసుక రేణువులను చూడగలిగినంత సునిశిత సూక్ష్మ దృష్టి కలిగి నిజమైన ఆనంద స్థితి అనుభవిస్తారు.

కర్మ సిద్ధాంతం నిరాశ, నిస్పృహలను సమూలంగా పెకలించగల్గుతుంది. ఈర్ష్య అసూయలను దూరం చేయగల్గుతుంది. అహంకారాన్ని ఏపుగా పెరగకుండా అదుపులో ఉంచగల్గుతుంది. మన వైఫల్యాలకు, మన దుఃఖాలకు మనమే కారణమనే చైతన్యాన్ని ఇవ్వగల్గుతుంది. కోట్లు సంపాదించటం వెనుక స్వీయ సమర్ధత పెద్దగా ఏమీ ఉండదు. సత్కర్మల ఆచరణ వలన లభించిన సద్యోస్ఫురణ అసలు కారణం.

మీకు చపాతీలు చేయగల నైపుణ్యం ఉన్నా, గోధుమ పిండి లేకుండా చపాతీలు చేయగలరా? గోధుమ పిండి ఒక నేపధ్యం; ఆ పిండి వెనుక గోధుమలు పండించిన తీరు తెన్నులు మరో నేపధ్యం; ***సంఘటనలు సన్నివేశాలు సూక్ష్మంగా విడగొట్టుకుంటూ వెళితే, మన ప్రతిభా పాటవాల అసలు విలువ సవ్యంగా అర్ధం చేసుకోగల్గుతాము.*** విశ్వంలో సూర్యాది నవగ్రహాల చలనం, భూ పరిభ్రమణం, ఋతువుల ప్రకారం ఫల పుష్పాదులు అభివృద్ధి చెందటంతో పాటు, విజ్ఞాన సాంకేతిక అభివృద్ధి మనుష్యుని మేధస్సు నుండి పుట్టించటం కూడా ఈ సృష్టిలో అంతర్భాగమే. ఏవో ఆలోచనలు వస్తాయి. ఏదో చేస్తాము. మరేదో జరుగుతుంది. ఇదంతా ఒక క్రమ పద్ధతిలో గొలుసుకట్టు సంఘటనల సమాహారంగా జరిగిపోతూ ఉంటుంది. అనంత వాహినిలో మనం నీటి బిందువులం.

మానవుడే మహనీయుడు అనే సినిమా పాట గురించి ప్రస్తావించారు. హృదయ పూర్వకంగా చెబుతున్నాను. మానవుడు నిజంగా మహనీయుడే! పషు పక్ష్యాదులకు, వృక్ష జాతులకు సృష్టిలో ఏ ఇతర ప్రాణులకు లేని "బుద్ధి" మనిషికి ఉంది. ఆ విధంగా మనిషి మహనీయుడే! కాని మనిషి తనకు తాను అలవిమీరిన

గొప్పతనం ఆపాదించుకోవటం వలన భంగపడవలసి ఉంటుంది. "ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ...." అనే సినిమా పాట కూడా ఉంది. ఆయా సన్నివేశాలకు తగిన విధంగా పాటలుంటాయి. అలాగని ఆ పాట రాసిన కవిది సానుకూల దృక్పథం, ఈ పాట రాసిన కవిది ప్రతికూల దృక్పథం అనలేముగా! అన్నింటిని మించిన వాస్తవిక దృక్పథం ఒటుందిగా.

**ప్రశ్న : భగవద్గీతలో మనం ఏమి అనుకుంటే అది జరుగుతుందని చదివాము. మనం అనుకున్నది జరిగేటప్పుడు ఇంకా కర్మ సిద్ధాంతం విశ్వసించటమెందుకు ?**

**జవాబు :** మనకు తెలియని దాన్ని నిర్ద్వందంగా తోసిపుచ్చటం సరైనపద్ధతి కాదు. తమిళనాడులో మనకు సంబంధించిన వివరాలు రాసిపెట్టి ఉన్న తాళ పత్ర గ్రంధాలున్న ఊరు ఒకటుంది. నా చిన్న తనంలో మా అమ్మమ్మ గారి ఊళ్ళో ఎవరో అక్కడకు వెళ్లినట్లున్నారు. పెద్దవాళ్ల మాటల ద్వారా విన్న మా ఈడు వాడొకడు "వేలి ముద్ర తీసుకుని మొత్తం చెప్పారట" అని సావాసగాళ్లమైన మాకు చెప్పాడు. వేలి ముద్ర చూసి చెప్పటం ఏమిటి, అదంతా అబద్ధమని నేను కొట్టి పారేశాను. తర్వాత కాలంలో "తాళ పత్రాల" మీద నా వివరాలు రాసి ఉండటం నేను స్వయంగా చూసి నిర్ధారించుకున్నాను. కొంత మంది "నాడీ జ్యోతిష్కులు" ఈ విద్యను దుర్వినియోగం చేసినంత మాత్రాన అసలు విషయాన్ని కాదనలేముగా! మీరు ఎవరైనా కొత్త విషయం విని, మీ అవగాహనా తాహతుకు అది అందనిదని తోచిన ఎడల, తెలియనితనం అంగీకరించి తటస్తంగా ఉండండి. తెలుసుకుని నిర్ధారించుకున్న తర్వాతే విశ్వసించండి. ఈ లోగా స్థిమితంగా ఉండండి. మీకు మంచే జరుగుతుంది.

ఇక భగవద్గీత గురించి చెబుతాను. సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన





"గీత" హిందువులందరికీ ప్రామాణిక గ్రంథంలో ఉన్న విషయానికి తిరుగేముంటుంది? మీరు ఏమి అనుకుంటే అది జరుగుతుంది. నిజమే. కాని మీరు ఏమి అనుకోవాలో అది అనుకోగలమని అనుకుంటున్నారా? ప్రారబ్ధ కర్మ ప్రకారం మీకు జరగవలసిన పరిణామాలకు అనుగుణంగా మీ బుద్ధి మిమ్మల్ని నడిపిస్తుంది. అయితే మీరు స్వేశ్ఛగా నిర్ణయించుకుని చేయగల పనులు కూడా ఉంటాయి. మీ జీవితంలో జరిగిన ఒక సంఘటన తీసుకుని, ఇది గతంలో చేసిన పనికి ఫలితమా, లేదా రేపు జరగబోయే పరిణామాలకు మీరు స్వేశ్ఛగా సృష్టించిన కారణం కాబోతుందా అనే విషయం తేల్చి చెప్పలేము. ***కాని జీవితం గడిచే కొలది, కర్మ సిద్ధాంతాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయించి అనువదించటంలో మీకు నేర్పరితనం అలవడుతుంది. అప్పుడు జరగబోయే విషయాలు ముందుగా తెలియక పోయినా, ఏది ప్రారబ్ధ కర్మో, ఏది అగామి కర్మో సంఘటనలు జరిగాక ఆ తేడా స్పష్టంగా తెలుస్తుంది. కావున ఏ విధంగా చూసినా "కర్మ సిద్ధాంతం" తెలిసి ఉండడం చాలా మంచిది.***

**ప్రశ్న : కర్మ సిద్ధాంత సారాన్ని రెండే రెండు సూక్ష్మ వాఖ్యాలలో చెప్పండి ?**

**జవాబు :** మీరు మంచి చేస్తే మీకు మంచి లభిస్తుంది. మీరు చెడు చేస్తే మీకు చెడు లభిస్తుంది.

**ప్రశ్న : ఏది మంచి ఏది చెడు అని ఎలా తెలుస్తుంది ?**

**జవాబు :** ఇతరులు మీకు ఏది చేస్తే సంతోషంగా భావిస్తారో అదే మంచి. ఇతరులు మీకు ఏది చేస్తే వేదన పడతారో అదే చెడు. ఒక ముక్కలో చెప్పాలంటే అందరూ మనలాంటి వారేనని గుర్తెరిగి ప్రవర్తించటం.

**ప్రశ్న : అందరూ మనలాంటి వారేనని తక్కువ స్థాయి వాళ్లను నెత్తిన ఎక్కించుకోలేముగా. మన అపార్టుమెంట్సులో పని చేసే కాపలా దారుడిని**

**(వాచ్ మ్యాన్), బట్టలు ఇస్త్రీ చేసే వారిని, ఆటో నడిపే వాళ్లను, కూలీ నాలీ జనాలను సమంగా ఎలా చూడగలం? ఒకవేళ అలా చూస్తే మనలను లెక్క చేస్తారా ?**

**జవాబు :** ఈ లెక్క చేయటం ఏమిటి? ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోండి. తమ తమ కర్మ ఫలాలు అనుభవించటానికి గతంలో అనేక జన్మలు తీసుకుంటూ ఈ భూమ్మీదకు వచ్చిన జీవాత్మలు వారి వారి ఋణానుబంధాల కారణంగా ఇక్కడ సంబంధ బాంధవ్యాలు మరియు వారి వారి యోగానుసారం జీవన ప్రమాణం కలిగి ఉంటారు. మనుషుల మధ్య ఆర్థిక స్థాయి కంటికి కనిపించినట్లు మిగిలిన అనేక ప్రామాణికాలు కంటికి కనిపించవు.

పరిణితిలో వ్యత్యాసం, భావాలలో వ్యత్యాసం, వ్యక్తిగత లక్ష్యాలలో గల వ్యత్యాసం – ఇవేమీ కంటికి కనిపించవు. సమాజంలో మెరుగైన ఆర్థిక పరిస్థితులు ఉన్నవారు స్వల్పాదాయ వర్గాల వారి కంటే పలు విధాలుగా సౌఖ్యవంతమైన జీవితం గడుపుతున్నారని ప్రత్యక్షంగా ఇరు వర్గాల వారికి తెలుస్తూనే ఉంది. పైగా సమాజంలో అందరూ చేసే పనులు అవసరమైనవే. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎంత అవసరమో, ఆటో నడిపే కార్మికుడు, ఇస్త్రీ చేసే వ్యక్తి, అంట్లు తోమే పని మనిషి అందరూ అవసరమైన వారే. వారి వారి పనిని బట్టి వేతనంలోనూ, ఆదాయంలోను వ్యత్యాసం ఉండవచ్చు. కాని గౌరవానికి అందరూ సమానమే. ఎవరినైనా కించపరచి మాట్లాడటం పాపమని కర్మ సిద్ధాంతం చెబుతుంది. ఇండియాలో జనాభ ఎక్కువ ఉన్న కారణంగా, ఉపాధి అవకాశాలు లేక, మన బట్టలు ఇస్త్రీ చేస్తూ, మనం ఎక్కిన కారు నడుపుతూ, మన ఇంట్లో గిన్నెలు తోముతూ.... ఇలా అనేక వృత్తులలో చాలా మంది ఇమిడి పోయారు. అమెరికాలో అయితే ఎవరి పని వారే చేసుకోవాలి. అక్కడ వస్తువులు దొరికినంత





విరివిగా సేవలు లభించవు. ఒకవేళ అరుదుగా లభించినా చాలా ఖర్చుచేయవలసి ఉంటుంది. కారణమేమంటే అక్కడ అందరూ మంచి సంపాదన, స్వంత కారు కలిగి జీవన స్థాయి మెరుగ్గా ఉంటుంది.

ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, ఇండియాలో తక్కువ ప్రతిఫలం తీసుకుని సేవలు అందిస్తున్న వారిని మరికాస్త గౌరవించాలి, వీలైతే ఎక్కువ ప్రతిఫలం వారికి అందించాలి. అహంకారం వలన ఆలోచనలకు కాలుష్యం పడుతుంది. ఆ కాలుష్యం శరీరమంతా పాకక ముందే జాగ్రత్త పడాలి. పాపమంటే చాలా మంది హత్యలు, మానభంగం లాంటి నేరాలు మాత్రమేనని పొరబడుతుంటారు. సాటి మనుషులను కించపరచటం కూడా పాపమేనని అందరూ తెలుసుకోవాలి. కర్మ ఫలం ఎవరినీ వదలదు. ఒకవేళ ఇప్పుడు మీకు మెరుగైన జీవితం లభించి ఉంటే, అది మీ పుణ్య ఫలం. అదే మీ అర్హత. అది నిలుపుకుని, ఈ జనన మరణం చక్రం నుండి విముక్తి అయ్యేందుకు మీరు కృషి చేయాలే గాని, పనికి మాలిన విషయాల మీద సమయం వృథా చేయగూడదు.

ప్రశ్న : **ఉపన్యాసాలు చెప్పేవారు మాటల గారడీతో, పుస్తకాలు రాసేవారు భాషా సౌందర్యంతో తమ అభిప్రాయాలను అందరి నెత్తిన రుద్దాలని చూస్తూంటారు. ఈ పుస్తకం ద్వారా మీరు అదే ప్రయత్నం చేస్తున్నారా?**

**జవాబు :** మీకు సందేహం రావటం మంచిదే. ఎవరు ఏది చెబితే అది నమ్మకుండా, అలాగని వ్యతిరేకించకుండా, తటస్థంగా ఉండి మీ జీవిత పేజీలలోని సంఘటనలతో సరి పోల్చుకున్నాక, ఆ విధంగా నమ్మకం కుదిరాకే విశ్వసించండి. అన్నింటికన్నా ముఖ్యంగా ''కర్మ సిద్ధాంతం'' అనేది నా అభిప్రాయం కాదు. నా మేధస్సు నుండి ఉద్భవించినది కాదు. వేదాంతంలో చెప్పబడింది. ఎంతో ప్రాచీనమైనది. ఎందరో పుణ్యపురుషులు కర్మ సిద్ధాంతం గురించి తెలియజేసారు.

ఇప్పుడు నేను కొత్తగా నా స్వంత అభిప్రాయాలు మీ మీద రుద్దటం లేదు. నేను పరిశీలించి, పరీక్షించి దీనికి అనుబంధంగా ఉన్న జ్యోతిష శాస్త్రాన్ని అభ్యసించి, ఇంకా అనేక అద్భుతమైన విషయాలను ఆకళింపు చేసుకుని స్ఫూర్తి పొంది, తెలిసిన విషయాలను, తెలుసుకున్న విషయాలను తర్కించుకుని నన్ను నేను విమర్శించుకుంటూ, తగ్గించుకుంటూ, నిర్ధారించుకుంటూ అందరికీ ఉపయోగపడే విషయాలని ఒకటికి వందసార్లు నిర్ణయమైతేనే ముందుకు వెళుతూ, సంవత్సరాల తరబడి అనేక పర్యాయాలు మార్పుచెందుతున్న భిన్న అనుభవాలను పరిశీలించుకుంటూ, ఈ పుస్తకం ద్వారా అందించాలనుకున్న అనేక విషయాలలో స్పష్టత సాధికారం కలిగి, ఎంతో అంతర్మథనం చెందిన మీదట డబ్బు, కీర్తి లాంటి ప్రాపంచిక ప్రలోభాలకు లోనవ్వకుండా, కేవలం లోకానికి కృతజ్ఞతలు చెప్పటానికే ఈ పుస్తకం రాస్తున్నాను.

**ప్రశ్న : కర్మ సిద్ధాంతం గురించి ఇప్పటికే అనేక పుస్తకాలు ఉన్నప్పుడు మళ్లీ మీరు రాయటమెందుకు?**

**జవాబు :** కల్పనా సాహిత్యం లాగా ఈ పుస్తకాలు అందరినీ ఆకట్టుకోలేక పోతున్నాయి. ఇప్పటికి చాలా తక్కువ శాతం మందికే "కర్మ సిద్ధాంతం" గురించి తెలుసు. అందరికీ తెలిసి ఉంటే బాగుంటుందనే నా ఆంతర్యాన్ని, దాపరికం లేకుండా ఈ పుస్తక ప్రారంభంలోనే వెల్లడించాను. కాకరకాయ కూర చేదని బాల్యంలో నేను తినేవాడిని కాను. అనేక ఔషద గుణాలున్న కాకరకాయ కూరను మా అమ్మ నా చేత తిన్పించలేక పోయింది. పైగా ఆమె వంట బాగా చేస్తుందని బంధు వర్గాల్లో ఓ గుర్తింపు కూడా ఉంది. ఏమైతేనేం! నా చేత కాకరకాయ కూర తినిపించలేక పోయింది. కాని పెళ్లయ్యాక నా భార్య ఇదే కాకరకాయను కమ్మగా వండి వడ్డించింది. ఆ తర్వాత నుండి ఇప్పటి వరకూ కాకరకాయ కూరను నిరాటంకంగా తింటూనే ఉన్నాను. మొత్తం మీద కాకరకాయ గొప్పతనం



**శుభారంభం** - కర్మ సిద్ధాంత పరిచయం

నా అనుభవంలోకి వచ్చింది కదా! ***ఇదిగో కర్మ సిద్ధాంతాన్ని కూడా చాలా మంది చేదుగా భావించి తినలేక పోతున్నారని గ్రహించి, నాకు చేతనైన రీతిలో ఈ పుస్తకం ద్వారా రుచి చూపించాలని, తద్వారా దాని పోషక విలువలు మీకు అందించాలని ఒక ప్రయత్నం చేస్తున్నాను.***

అసలు విషయం నేరుగా చెప్పకుండా ఈ విశ్లేషణలు ఎందుకని మరో ప్రశ్న వేయకండి. మీకు ఇష్టం లేని ఆసక్తి లేని విషయాలను మీరు నేరుగా స్వీకరించలేరు గదా! అందుకే నాకు ఈ కుప్పిగంతులు తప్పటం లేదు.

**ప్రశ్న : ఈ పుస్తకం వలన ఎవరైనా ప్రయోజనం పొందుతారని మీకు నమ్మకముందా?**

**జవాబు :** నమ్మకం కుదిరాకే ఈ పుస్తకం రాస్తున్నాను. మీకు ఒక సంఘటన గురించి చెబుతాను..

హైదరాబాద్ సిద్ధార్థనగర్‌లో ఒకసారి చిలుకజోస్యం చెప్పే 20 ఏండ్ల కుర్రాడు నాకు తారసపడ్డాడు. మా కాలనీలో అందరూ విద్యావంతులు, ఉన్నత ఆదాయ వర్గాల వారు నివసించేవారు. ఈ కారణంగా చిలుకజోస్యం ఎవరు చెప్పించుకుంటారని నాకు అన్పించింది. అదే మాట ఆ కుర్రాడిని అడిగాను. "తక్కువే సార్ రోజంతా తిరిగినా నలుగురుకు మించి దొరకరు. ఒక్కోరోజు అది కూడా ఉండదు" అన్నాడు. మరి ఈ పని ఎందుకు చేయటం అని అడిగాను. నాకు ఇంకో దందా రాదు నాకు చేతనైన పని ఇదే. అందుకే గడవడం కష్టంగా ఉన్నా ఈ పని చేస్తున్నానని చెప్పాడు.

అప్పుడు నాకు అర్థమయిందేమిటంటే, ఎవరో ఒక వ్యక్తి లేదా కొంత మంది వ్యక్తులు (సంఖ్య మనం అంచనా వేయలేము) ఈ చిలుకజోస్యం కుర్రాడి చేత నాలుగు మాటలు చెప్పించుకుని, స్ఫూర్తి పొంది, ప్రేరణ చెంది,

యాదృశ్చికంగా వారి జీవితం అక్కడ నుండి పెద్ద టర్నింగ్ తీసుకుంటుంది. తద్వారా ఆ వ్యక్తి ప్రారంభించబోయే భారీ పరిశ్రమ అనేక మంది ఉపాధికి కారణమవుతుంది. ఇదిగో.....సరిగ్గా ఇలాంటి అవసరం కోసమే ఆ కుర్రాడిచేత "విశ్వం" చిలుకజోస్యం చెప్పిస్తుంది. ఒకవేళ ఆ చిలుక జోస్యుడు గత జన్మలో "జ్యోతిషం" ద్వారా పుణ్యబలం పోగుచేసుకుని ఉన్నట్లయితే, సెంటిమెంటుగా పరిశ్రమ పెట్టిన వ్యక్తి ఈ చిలుకజోస్యం కుర్రాడిని వాళ్ల సంస్థలో ఆస్థాన జ్యోతిష్కుడిగా నియమించుకుంటాడు. వర్తమాన కాలానికి తగిన విధంగా "డిజగ్నేషన్" మార్చి నియమించుకుంటాడేమో గాని నేపధ్యం సెంటిమెంటు ఉంటుంది. ***చిలకజోస్యంతో నిజంగా ఇకమీదట ఎవరికీ ఉపయోగం లేదనుకుంటే, "విశ్వం" అలాంటి ఒక సమయాన్ని ఖచ్చితంగా నిర్ణయించి, చిలుక జోస్యులను వేరే ఇతర వృత్తులలోకి నెట్టేలా చేస్తుంది.*** ఇదీ ఆనాడు నా మనస్సులో స్ఫురించిన విషయాలు. అవే ఈనాడు మీకు నేను చెప్పాను. నాలుగేళ్ల క్రితం ఒక చిలుకజోస్యం కుర్రాడిని చూడగానే అంత ఉన్నతంగా, తార్కికంగా ఆలోచించినవాడిని, పుస్తకం రాయబోయేముందు, రాస్తున్న తరుణంలో నన్ను నేను ఎన్ని పరీక్షలకు గురిచేసుకుని ఉంటాను? మీరు "ఎండ్ ప్రొడక్ట్"ను చదువుతున్నారు. ఎడిట్ చేసిన మెటీరియల్ ఇంతకు పదింతలు ఉంటుంది. కావున ఈ పుస్తకం వలన ఎంతో మంది ప్రయోజనం పొందుతారని స్థిరంగా చెప్పగలను.

ప్రశ్న : **ప్రారబ్ధకర్మ, జ్ఞానం గురించి సులభంగా అర్ధమయ్యేందుకు ఒక కథ లాగా చెప్పండి?**

**జవాబు :** సాయంత్రం నాలుగ్గంటలకు అప్పలరాజు బస్టాండులో ఒక అందమైన అమ్మాయిని చూసాడు. బాగుందనుకున్నాడు. అంతవరకయితే పరవాలేదు. దగ్గరగా వెళ్లి పలుకరించాడు. ఆ అమ్మాయి నవ్వుతూ జవాబిచ్చే సరికి మెల్లగా





మాట కలిపాడు. తన పేరు అనుష్క అని, తాను ఒక కొరియర్ కంపెనీలో పని చేస్తున్నానని చెప్పింది. పది నిమిషాలయ్యాక అనుష్క కాఫీ తాగుదామా? అని అడిగాడు అప్పలరాజు మగ చొరవతో. ఆ తర్వాత ఇద్దరూ కాఫీ హొటల్లో టిఫిన్లు తిని, కాఫీ త్రాగి అరగంట కాలక్షేపం చేసారు. అక్కడనుండి పక్కనే ఉన్న పార్కుకెళ్లి ఓ గంట బాతాఖాని వేసుకున్నారు. చివరగా రాత్రి 8 గంటలకు ఒకరి ఫోన్ నెంబరు మరొకరు తీసుకొని మర్నాడు అదే బస్టాపులో కలవాలని ప్రామిస్ చేసుకొని విడిపోయారు.

అప్పలరాజు తాను ఒక అమ్మాయిని పడగొట్టాననే సంబరంలో ఒళ్లు తెలియకుండా, ఆ అమ్మాయి పూర్వాపరాలు తెలుసుకోకుండా, రోజూ బస్టాపులో కలుసుకోవటం, కాఫీ హొటల్లో ఫలహారాలు సేవించటం, పార్కులో బాతాఖాని, రాత్రి 8 గంటలకు ఇళ్లకు బయలుదేరటం, ఇలా మూడు వారాలు గడిచాయి. రెండు వీకెండ్సులో అనుష్కను తన రూమ్‌కు రమ్మని ప్రపోజ్ చేసాడు అప్పలరాజు. ఏదో పనుందని రెండుసార్లు "నో" చెప్పింది అనుష్క.

మూడోవారం తన రూమ్‌కు రావలసిందేనని పట్టు బట్టాడు అప్పలరాజు. కుదరదని నవ్వుతూనే జవాబిచ్చింది అనుష్క. తన ప్రేమకు విలువ లేదా అని భావోద్వేగంతో ప్రశ్నించాడు అప్పలరాజు. లేదని పకపక నవ్వింది అనుష్క. ముఖం కందగడ్డలా మారింది అప్పలరాజుకు. అప్పటికే అనుష్కతో మోహంలో పడ్డాడు. రూమ్‌కు తీసుకువెళ్లి కోరిక తీర్చుకోవాలనుకున్నాడు. అనుష్క తిరస్కరించేసరికి క్రోధం కట్టలు తెంచుకుంది. కోరిక తీరకపోతే క్రోధమేగా! అహం దెబ్బతింది. క్షోభపడ్డాడు. ఉద్రేకం శరీరంలోని ప్రతి అణువూ వ్యాపించింది. మరెందుకు నాతో తిరిగావు? అని ప్రశ్నించాడు విచక్షణ కోల్పోయిన అప్పలరాజు. ఆవేశంతో, రోషంతో అప్పలరాజు ఉడికిపోతుంటే అనుష్కకు వినోదంగా ఉంది. మాటా మాటా పెరిగింది. ఘర్షణ తారాస్థాయికి వెళ్లింది.

అప్పటి వరకు చెట్ల చాటునుండి ఈ ఉదంతాన్ని చూస్తున్న అనుష్క ఫ్రెండ్స్ ముగ్గురు మగవాళ్లు వీళ్ల దగ్గరకొచ్చారు.

"ఇక చాల్లేరా.... నీ టాలెంటు ఒప్పుకుంటున్నాం" అనుష్కతో అని, అప్పలరాజు కేసి తిరిగి "సారీ అప్పలరాజు వాడు అమ్మాయి కాదు. మా ఫ్రెండు ఆచారి" అని అసలు విషయం చెప్పారు వాళ్లు. అప్పటికే అనుష్క ఎలియాస్ ఆచారి తలమీద నుండి విగ్గు తీసేసాడు. ఆడ దుస్తులు మార్చుకుని పూర్తిగా మగ వ్యక్తిగా మారిపోయాడు.

అసలు విషయం ఆచారి వివరించాడు. అతనొక ఆర్టిస్టు. ఆ రోజు ఆడ వేషంలో ఒక సినిమా షూటింగ్‌లో పాల్గొని సరదాగా అదే వేషంతో బస్టాపుకు వచ్చాడు. అప్పలరాజు తనను అమ్మాయిగా భావించి పలకరించేసరికి, గొంతు మార్చడంలో నైపుణ్యం ఉన్న ఆచారి ఆడ గొంతుకతో రెస్పాన్సు ఇచ్చాడు. ఆ రోజు రాత్రి ఆ విషయం ఫ్రెండ్స్‌కు చెప్పాడు. అప్పలరాజు ఎంతవరకు వెళ్తాడో చూద్దామని ఆచారి ఫ్రెండ్స్ ఈ నాటకాన్ని కంటిన్యూ చేయమని ప్రోత్సహించారు. ఇదీ జరిగింది. ఆచారి అతని ఫ్రెండ్స్ అప్పలరాజుకు సారీ చెప్పి వెళ్లిపోయారు.

అప్పలరాజు ముఖాన నెత్తురు చుక్కలేదు. పది లంకణాలు చేసిన వాడిలా తయారయ్యాడు. పార్కులోనే కుమిలి కుమిలి ఏడ్చాడు. అనుష్కతో గడిపిన అందమైన సాయంత్రాలు గుర్తు తెచ్చుకొని ఆమెను మరచిపోలేక పోతున్నాడు. దానికి తోడు అనుష్క లేదు, అది మాయ, అతను ఆచారి అనే వాస్తవం జీర్ణించుకోకుండా, మొత్తం ఎపిసోడ్‌ని అవమానంగా ఫీలవుతున్నాడు.

ఆడది కాదు మగాడు అని తెలిసాక, అనుష్క కాదు అది మాయ, అతను ఆచారి అని తెలిసాక, ఇంకా అనుష్క గురించి ఆలోచించటం తెలివిగల పనేనా? అనుష్క భ్రమ అని తేలిపోయాక ఇంక భ్రాంతిలో ఉండటం ఏమిటి? సంఘటన





సరదాగా తీసుకుని నవ్వేసే దానికి, మనసుకు మైదా రాసి అంటించటం వలన మరింత వేదనకు గురవుతున్నాడు. మోహం, దానికి తోడు దెబ్బతిన్నాననే అహం వలన చాలా రోజులనుండి క్షోభకు గురవుతూనే ఉన్నాడు అప్పలరాజు. ఇప్పటికీ రోజూ బస్టాపుకు వెళ్లి అనుష్క పరిచయాన్ని తలుచుకుని, అక్కడ నుండి కాఫీ హొటల్‌కు వెళ్లి, ఆ తర్వాత పార్కుకెళ్లి సంగతులను వదలకుండా పెనవేసుకుంటూ అజ్ఞానంతో క్షీణించి పోతున్నాడు అప్పలరాజు.

* * * * *

ప్రియమైన పాఠకులారా ! అప్పలరాజు అజ్ఞానానికి మీరు నవ్వుకుంటున్నారు కదూ ! ఆడది కాదని తెలిసాక ఇంకా ఆలోచించటమెందుకు? అప్పలరాజు తెలివితక్కువ వ్యక్తి అని మీరు ఒప్పుకున్నట్లేగా. అనుష్క రూపంలో ఉన్న ఆచారిని గుర్తించలేక, ఆ మాయనే నిజం అనుకుని భ్రాంతిలో పడి ఏ విధంగా భంగ పడ్డాడో, అజ్ఞానంతో "మాయ" తో బంధం పెంచుకొని కుడితిలో పడ్డ ఎలుకలా ఎలా కొట్టుకుంటున్నాడో మీరూ గమనించారుగా. ఆమె అనుష్క కాదు ఆచారి అనే సత్యం ఇంకా తెలుసుకోకుండా అప్పలరాజు మోహ పీడితుడిగా ఏ విధంగా దుఃఖాన్ని అనుభవిస్తున్నాడో, అదే విధంగా అందరు కూడా ఈ దేహమే వాస్తవం అని భావించి, లోపల ఉన్న ఆత్మను తెలుసుకోలేకపోతున్నారు. ఎప్పుడైతే ఇది తెలుసుకుంటారో, ఇన్ని రోజులు మన దేహంతో మోహం లో చిక్కుకున్న విధానం, అప్పలరాజు ఉదంతంలా ఉందని అర్ధం చేసుకుని, అజ్ఞానాన్ని తొలగించుకుని ఆత్మను తెలుసుకుని నిజమైన సంతోషం అనుభవిస్తారు.

ఇప్పుడు అప్పలరాజు కథను ఇంకొంచెం లోతుగా విశ్లేషించుకుందాము. ఆచారి కాని, అతని ఫ్రెండ్స్‌కు గానీ అప్పలరాజు మీద ద్వేషం లేదు. శత్రుత్వం లేదు. ఒక పథకం ప్రకారం ఆచారి అప్పలరాజును స్త్రీ వేషం వేసుకుని మోసం

చేసి ఏడిపించలేదు. ఆ రోజు బస్టాపులో తనను అమ్మాయిగా భావించి అప్పలరాజు వచ్చి పలుకరించేవరకు, అతనెవరో ఆచారికి పరిచయం కూడా లేదు.

బుద్ధి కర్మాను సారిణి అంటే ఇదే. జననంతో వెంట తెచ్చుకున్న ప్రారబ్ధ కర్మ కారణంగా బుద్ధి అప్పటికప్పుడు ప్రేరేపించబడి, అనుష్క రూపంలో ఉన్న ఆచారిని పలుకరించాడు అప్పలరాజు. ఇతను గతంలో చేసిన కర్మ ఫలం అనుభవించేందుకు "ఆచారి" నిమిత్తమాత్రుడయ్యాడు. **అంటే మనకు జరిగే సమస్త విషయాలకూ ఇలా ఎవరో ఒకరిని కారణంగా భావించి పొరబడుతుంటామే గాని, కర్మ ఫలం అనుభవించే విధంగా ఇతరులు సాధనం అవుతుంటారని మన కష్ట సుఖాలకు మనమె బాధ్యులమని** గ్రహించాలి. ఆచారి షూటింగ్ నుండి ఆడ వేషంతో బయలు దేరటం, అదే సమయానికి అప్పలరాజు బస్టాపుకు రావటం – ఇవన్నీ ముందే నిర్ణయింపబడి జరిగిన సంఘటనలుగా అర్ధం చేసుకోవాలి. అప్పలరాజుకు కనీసం కర్మ సిద్ధాంతం గురించి తెలిసి ఉన్నట్లయితే, తాను ప్రారబ్ధకర్మ అనుభవించేందుకు ఇదంతా జరిగిందని అర్ధం చేసుకుని కర్మ ఋణం చెల్లించినందులకు సంతోషించేవాడు. ఎప్పుడైనా ఋణం తీర్చవలసిందే కదా!

పాఠకులారా "అనుష్క" మాయ. సత్యం కాదు. అయినప్పటికీ ఆ మాయ వలన అప్పలరాజు సంతోషం అనుభవించాడు. మాయ తొలగే సరికి, ఆ సంతోషం పోయి దు:ఖించాడు. సంతోష దు:ఖాలు ద్వందాలు. ఒకటి ఉందంటే, దాని వెన్నంటే రెండోది కూడా ఉంటుంది.

**ప్రశ్న : అయ్యా, ఇప్పుడు మీరు చెప్పిన కథ చదివాక ఏదో కొంత అర్థమైనట్లే ఉంది. వేదాంతం, ఆత్మజ్ఞానం, కర్మ సిద్ధాంతం గురించి మేము తెలుసుకోవటం ఎందుకు? మా కుటుంబ అవసరాలకు కావలసిన డబ్బు, ఉండటానికి ఇల్లు, తిరగటానికి కారు, స్నేహితులు, బంధువులతో సంతోషంగా ఉంటే సరిపోదా?**

**జవాబు :** ఎంత మాత్రం సరిపోదు. మీ వయస్సు, విద్యార్హత, వృత్తి, ఆర్థిక





పరిస్థితి. సంబంధ బాంధవ్యాలు నాకు తెలియవు కదా! కాని మీరు తీవ్ర మనస్తాపానికి గురయిన సందర్భాలు ఉన్నాయి. అవసరానికి డబ్బు సర్దుబాటు గాక వత్తిడికి లోనయిన రోజులున్నాయి. ఉద్రేకం మిమ్మల్ని ఊపేసిన సన్నివేశాలు కూడా ఉన్నాయి. అనారోగ్యంతో ఇబ్బంది పడిన రోజులున్నాయి. మీరంటే గిట్టని వారితో స్పర్ధలున్నాయి. మీ తెలివికి తగిన గుర్తింపు, హొదా రాలేదన్న దుగ్ద ఉంది. నమ్మిన వారు మోసం చేసిన అనుభవాలున్నాయి. అన్నీ సాధించినా పిల్లలు స్థిరపడలేదనే దిగులు ఉంది. రిటైర్‌మెంటు తీసుకున్నాక ఎలా జీవించాలన్న ఆందోళన ఉంది.

ఇప్పుడు చెప్పిన కష్టాలలో కొన్నయినా మీకు ఉండి ఉంటాయని నేను నమ్మకంగా చెప్పగలను. ***ఎందుకంటే జననం నుండి మరణం వరకు మనందరం ఒకే పడవలో ప్రయాణించకపోయినా, మనం ప్రయాణించే పడవలన్ని ఒకే రకానికి చెందినవి.*** ఇది ముమ్మాటికీ నిజం. అదెలాగంటే "ప్రారబ్ధకర్మ" లేకుండా అసలు మనకు జన్మే ఉండదు. ఎవరికి సంబంధించిన పాప పుణ్యాలు వారు అనుభవించి తీరాలి. ఈ విషయం మీకు తెలిసినా, తెలియక పోయినా ఇది తప్పదు.

కర్మ సింద్ధాంతం తెలిసినా తెలియకపోయినా జనన మరణ చక్రం ఆగదు. మీరు వద్దనుకున్నా మళ్లీ మళ్లీ పుడుతూనే ఉంటారు. కాని ఒక వేళ పునర్జన్మ వద్దు, మోక్షం కావాలి అనుకుంటే, ఏమి చేయాలనేది తెలిసి ఉండాలి కదా! దీనికి కర్మ సిద్ధాంత జ్ఞానం తప్పని సరిగా అవసరం. అంతే గాక జీవితంలో అడుగడుగునా ఆందోళన పడకుండా ప్రశాంతంగా గడపాలని మీకుంటుంది కదా! మనం చని పోయాక మన సంతానం మరియు భావి తరాలు ప్రశాంతంగా జీవించటం మీకు ఆనందమే కదా! ఇదిగో ఇందు కోసమైనా కర్మ సిద్ధాంతం గురించి, జ్ఞానం గురించిన ప్రాథమిక పరిచయం మీకు ఉండి తీరాలి.

మీ స్నేహితులు, బంధువులు మీ కంటే సౌకర్యంగా సౌఖ్యంగా జీవిస్తున్న వారు మీ కళ్లముందే ఉన్నారు కదా! కనీసం ఈ వ్యత్యాసాలు ఎందుకో తెలుసుకోవాలని మీకు లేదా? "లేట్ బెటర్ దెన్ నెవర్" అని ఆంగ్లంలో సామెత, అంటే అసలు ఎప్పటికీ తెలియకుండా పోవడంకంటే, ఆలస్యంగానైనా తెలుసుకోవటం శ్రేష్టమని అర్ధం. మానవ జీవిత అంతిమ లక్ష్యం మోక్షం సాధించటమని వేదంలో చెప్పబడింది. మోక్షం సాధించటం కాలేజీలో డిగ్రీ తీసుకోవటంతో పోల్చుకుందాం. కనీసం ఈ జన్మలో ఇంటర్, టెన్త్ లేదా ఐదో తరగతి, చివరగా రాయటం చదవటమైనా వచ్చి ఉంటే తర్వాత జన్మలలో మోక్షం అనే పట్టా తీసుకోవచ్చును. ***చదువు లేని వాడికంటే, చదువుకున్న వారి జీవితం మెరుగ్గా ఉన్నట్లే, జ్ఞానం గురించి కర్మ సిద్ధాంతం గురించి అవగాహన కలిగాక, మీ జీవితమే కాదు ఈ ఆనందం మీ భావితరాల వారికీ పాకుతుంది.***

**ప్రశ్న : కర్మ సిద్ధాంతంలో అంతర్లీనంగా ఉన్న సారాంశం ఏమిటి?**

**జవాబు :** మన సంతోష దు:ఖాలకు మనమే కారణం. దేవుడు గాని వేరొక వ్యక్తి గానీ ఎవ్వరూ కారణం కాదు. కొన్ని సమయాలలో మన కష్టాలకు ఇతరులు కారణంగా పైకి కన్పిస్తున్నప్పటికీ అది వాస్తవం కాదు. మనం గతంలో చేసిన కర్మలకు ఇప్పుడు ఫలితం అనుభవించేందుకు ఇతరులు వారికి తెలియకుండానే సాధనమవుతుంటారు. అసలు రహస్యం ఇదే. ఈ పుస్తకంలో అప్పలరాజు ఉదంతంలో ఆచారి పాత్రలా ఉంటుంది. ప్రారబ్ధకర్మను అనుభవించేందుకు వీలుగా మన బుద్ధి ప్రేరేపింపబడుతున్నప్పటికీ, గతంలో ఫ్రీ విల్ తో (ఉద్ధేశపూర్వకంగా) మనం చేసిన కర్మలయొక్క ఫలితమే నేడు మనం అనుభవిస్తున్నాము గనుక, చేయునట్టి సంకల్పము మన నుండే వచ్చినదని గ్రహించవలెను. ఏదైనా చేసిన తప్పుకు శిక్ష ఉంటుంది. ***ఈ శిక్ష తప్పులు జరిగిన వెంటనే ఐతే కనిష్టంగాను, కాలం గడిచే కొలదీ గరిష్టంగాను ఉంటుంది.***





అందువలన వీలైనంత వరకూ తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి. ఒకవేళ పొరపాటున తప్పు చేసిన యెడల, చేసిన తప్పు చిన్నదైనా పెద్దదైనా "శిక్ష" ను తప్పించుకునే ప్రయత్నం ఎవరూ చేయరాదు. తమ సంతానానికి కూడా ఈ ధార్మికత నేర్పించాలి.

ప్రారబ్ధకర్మను ప్రాయశ్చిత్త సుకర్మలు చేసి తొలగించుకునే అవకాశం ఉంది. కొన్నింటికి తప్పనిసరిగా ఫలితం అనుభవించవలసి వచ్చినా, ఎప్పటికైనా చేసిన ఋణం చెల్లించవలసిందేనని, ఆలస్యం అయినకొద్దీ వడ్డీలా పాపం పెరుగుతుందని అప్పుడు మరింత కష్టతరమవుతుందని గ్రహించి, కర్మ ఫలం అది ఎంతటి వేదన కలిగించినా అనుభవించాలి. ఆ తదుపరి స్వేఛ్ఛ లభించి వివేకంతో అప్రమత్తంగా ఉంటూ శేష జీవితం ప్రశాంతంగా జీవించవచ్చు. ఏ వ్యక్తి అయినా నేరం చేసి తనకున్న పలుకుబడిని, అధికారాన్ని ఉపయోగించి మనం తయారుచేసుకున్న చట్టం నుండి తప్పించుకో గలడేమో గానీ, ప్రకృతి చట్టమైన "కర్మ సిద్ధాంతం" నుండి తప్పించుకునే అవకాశం లేదు. భౌతిక శరీరంతో చేసే పనులకు ఫలితాలున్నట్లే, సూక్ష్మ శరీరమైన మనస్సుతో చేసే ఆలోచనలకు కూడా ఫలితాలుంటాయి.

"రియల్ ఎస్టేట్సు" వ్యాపారం ద్వారా ఆకశ్మికంగా "డబ్బు" సంపాదించిన వారి సంగతేమిటని మీరు ప్రశ్నిస్తారు. గతంలో వారు వెంటతెచ్చుకున్న పుణ్యబలం ఇప్పుడు అనుకూల పరిస్థితులు ఏర్పడి ఫలించిందని అర్ధం చేసుకోవాలి. ఆయాచితంగా అంతులేని సంపద వచ్చి పడిందని చూసేవారు ఆక్రోశించటం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. ముఖ్యంగా అలా "ఏడవటం" కూడా పాప ఫలమని వీలైనంత త్వరగా గ్రహించుకుంటే మంచిది. ***నిరంతరము ఇతరుల గురించి ప్రేమతోనూ తనను తాను పరిశీలనతోనూ చూడాలి.*** మోసం చేసి డబ్బు సంపాదిస్తున్నవారు, అవినీతి లంచగొండులూ కూడా బాగానే ఉన్నారని

మీరు సందేహం వెళ్ళబుచ్చితే, దానికీ సమాధానం ఉంది. ఇతరులు పాప పుణ్యాలు మనం బేరీజు వేయదగినవి కావు. సిద్ధాంత రీత్యా సందేహం తీర్చుకోవటం కోసమైతే పర్వాలేదు. ఇలాంటి సందేహాలకు సమాధానం మరింత జాగర్తగా అర్ధం చేసుకోవాలి. లేకుంటే పోను పోను కర్మ సిద్ధాంత అధ్యయనం మరింత గందరగోళంగా అనిపిస్తుంది.

ఎంత డబ్బు సంపాదించినా ఆ వ్యక్తి వెంట తీసుకు వెళ్లగలిగింది ఏమీలేదు. కొన్ని సార్లు అంతులేని సంపదలను అనుభవించవలసిన జీవాత్మ కొఱకు ఈ వ్యక్తి నానా గడ్డి కరిచి కూడబెడ్తుంటాడు. అంటే తిన బుట్టబోయే వాడి ధన సంపాదనకు ఈ వ్యక్తి మేనేజింగ్ ట్రస్టీ లాంటి వాడని గమనించాలి. ఈ డబ్బు సంపాదన వెనుక గత జన్మలో అతను చేసిన కర్మ ఉంటుంది. అది ఈ జన్మలో తీరని దాహం గా అతన్ని పట్టుకుని పీడిస్తూ ఉంటుంది. సమాజంలోని అవినీతి, లంచగొండుల పాపపు ధన సంపాదన వెనక కారణం ఈ విధంగా ఉంటుంది. కానీ పరిశ్రమలు స్థాపించి, తన వ్యాపార సంస్థల ద్వారా వేల కోట్లు ఆర్జించిన వారి పరిస్థితిని ఇప్పుడు సవ్యంగా విశ్లేషించుకుందాం.

వారి ఆస్తుల విలువ, పరిశ్రమల విలువ ఎన్ని కోట్లు అయినప్పటికీ, వాటిని అందరూ ఉపయోగించుకోగలుగుతున్నారు కదా! అంటే వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఓనరు లేదా మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్న వ్యక్తి అతని పనికి తగిన విధంగా ఎక్కువ సౌకర్యాలు అనుభవిస్తాడు. అందులో తప్పేముంది? ఆ మాత్రం సౌకర్యాలు వేల కోట్లు లేని తక్కువ ఆదాయ వర్గాల వారు, ఉద్యోగులు కూడా పొందుచున్నారు. మరి వేల కోట్లు ఉంచుకుని అతను తిని పోవటం లేదు కదా! చని పోయేటప్పుడు కూడా వెంట తీసుకుపోడు. ఈ ఆస్తులు ***"ఫలానా ఆయనవి"*** అనే గుర్తింపు ఒక్కటే అతను అదనంగా అనుభవిస్తాడు. ఈ విధంగా కాలానుగుణంగా ఈ "గుర్తింపు" మరి కొందరి





చేతుల్లోకి వెళ్లవచ్చును. కాని ఆ పరిశ్రమలు, ఆస్తులు అక్కడే ఉంటూ మనందరికీ లేదా మనలాంటి కొందరికీ ఉపయోగ పడ్తుంటాయి.

ఈ విధమైన ధార్మిక సాత్విక ఆలోచనా విధానం ఎంత హాయిగా ఉందో గమనించారా? ఇదిగో ఇలాంటి సవ్యమైన ఆలోచనా విధానం "కర్మ సిద్ధాంతం" అవగాహన చేసుకోవటం వలన ప్రతి ఒక్కరిలో అభివృద్ధి చెందుతుంది. సుఖ సౌఖ్యాలు, అధికారము, సంతోషము, జన సహకారము – ఇవన్నీ యోగానుసారం ప్రాప్తించేవి. చివరగా ఒక మాట. ఈ పుస్తకం నేను రాయటం, మీరు చదవటం మొత్తం "కర్మ సిద్ధాంతం" యొక్క చక్రంలోకే వస్తుంది. ***"విశ్వం" గురించి లోతుగా వెళ్తుంటే, మన అజ్ఞానం అహంకారం మంచులా కరిగిపోతూ మన గురించి మనకు బాగా అర్ధమవుతుంది.***

ఈర్ష్య, అసూయలు అధిగమించాలంటే సవ్యమైన ఆలోచనా విధానమే సరైన మందు. ఏదైనా సాధించాలి, సాధించిన వారిని అభినందించాలి.

**ప్రశ్న : కర్మ సిద్ధాంతం, ఆధ్యాత్మిక జ్ఞానం–ఒక దానికొకటి సంబంధం ఉందా?**

**జవాబు :** సంబంధం ఉంది. కర్మ సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకోటం వలన ఆధ్యాత్మిక జ్ఞానం మీద త్వరితంగా అనురక్తి ఏర్పడుతుంది. అయితే జ్ఞానం సద్గురువుయొక్క అనుగ్రహం లేకుండా సాధ్యపడదు. ఈ పుతకంలో నేను పరిచయం మాత్రమే చేస్తున్నాను. ఇలా పరిచయం చేయటం "కనక దుర్గమ్మ గుడి" ఫలానా విజయవాడలో కృష్ణానది ఒడ్డున కొండమీద ఉందని చెప్పటంలాంటిది. గుడికి వెళ్లటం, దర్శనం అర్చన అభిషేకం అష్టోత్తరం, సహస్రం అవన్నీ ఎవరి సాధన ప్రకారం వారు చేసుకోవాల్సిందే!

**ప్రశ్న : సంచిత కర్మలు అంటే ఏమిటో చెప్పండి?**

**జవాబు :** అనేక జన్మల నుండి సదరు జీవికి చెందిన పాప పుణ్యాల మొత్తం నిల్వ, అంటే పోగు పడ్డ కర్మలను సంచిత కర్మలంటారు.

**ప్రశ్న : ప్రారబ్ధ కర్మ అంటే ఏమిటో వివరించండి?**

**జవాబు :** సంచిత కర్మలలో పక్వానికి వచ్చి అనుభవించటానికి సిద్ధమైన కర్మలను ప్రారబ్ధ కర్మలంటారు. అంటే ఫలితాలుగా మారబోతున్న పాప పుణ్యాలే ప్రారబ్ధ కర్మ. ఈ కర్మ ఫలాలు అనుభవించటానికి ఒక భౌతిక శరీరం కావాలి గావున అందుకు తగిన విధంగా "జన్మ" ఏర్పడుతుంది. సంచిత కర్మ మన పాప పుణ్యాల మొత్తం ఖాతాను తెలియజేస్తుంది. మొత్తం అనుభవంలోకి రావలసి ఉన్న గరిష్ట నిల్వ. ఈ మొత్తం గరిష్ట నిల్వ నుండి కొంత భాగం తీసుకుని "ప్రారబ్ధ కర్మ" గా వెంట బెట్టుకుని మనం "జన్మ" తీసుకుంటాము. ఆయుష్షు, ఐశ్వర్యం, ఆరోగ్యం, అనారోగ్యం, పేదరికం, సంబంధ బాంధవ్యాలు మొదలైన అన్నింటిని ప్రారబ్ధకర్మ నిర్ణయిస్తుంది.

**ప్రశ్న : ఆగామి కర్మలంటే ఏమిటో తెలియజేయండి?**

**జవాబు :** ప్రారబ్ధకర్మ అనుభవించటానికి జన్మనెత్తి వాటి ఫలితాలు అనుభవించే మనందరం, మరలా ఈ జన్మలో కొత్తగా ఇష్టపూర్వకంగా కొన్ని కర్మలు చేస్తాము కదా! ఆగామి అనే పదం ఆగమనం నుండి వచ్చింది. అంటే ఆగామన కర్మలు. ఇప్పుడు వచ్చే కర్మలు. ఈ కర్మలకు కూడా ఫలితాలుంటాయి.

జననం నుండి మరణం వరకు "ప్రారబ్ధ కర్మ" అనుభవించే విధంగా మన బుద్ధి ప్రేరేపింపబడి, మనకు తెలియకుండానే తదనుగుణమైన కర్మలు చేస్తూ ఉంటాము. ప్రారబ్ధ కర్మ పూర్తవగానే మరణం సంభవిస్తుంది. ఒక వ్యక్తి చిన్న వయస్సులో చని పోయాడంటే ఆ వ్యక్తి అనుభవించవలసిన ప్రారబ్ధకర్మ పూర్తిగా అనుభవించాడని అర్థం. అందుకే ఎక్కువ కాలం జీవించి ఉన్న వారిని





పాపి చిరాయు/దీర్ఘాయువు అని అనటం లోకంలో ఉంది. అయితే ఈ లోకోక్తిలో పూర్తి నిజం లేదు. ఎందుకంటే ప్రారబ్ధకర్మ లో ఎక్కువ పుణ్యం ఉన్న వ్యక్తులు కూడా ఆ ఫలితం అనుభవించేందుకు దీర్ఘకాలం జీవిస్తారు కదా! అప్పుడు పుణ్యాత్ములు చిరకాలం జీవిస్తారని అనాలి గదా! ఏది ఏమైనా ప్రారబ్ధకర్మ పూర్తయితే జీవితం ముగుస్తుంది. ఈ జీవితంలో ప్రారబ్ధకర్మ అనుభవించే క్రమంలో మనం కొత్తగా ఫ్రీవిల్ తో కొన్ని కర్మలు చేస్తాము. వీటినే ఆగామి కర్మలు అంటారు. కొన్ని ఆగామి కర్మల ఫలితం ఈ జన్మలోనే అనుభవిస్తాము. ఫలించిన ఆగామి కర్మల పద్దు రద్దయింది. ఒకవేళ ప్రారబ్ధకర్మ ముగిసి మరణం సంభవించిన యెడల, అప్పటికి అనుభవం లోకి రాని ఆగామి కర్మల ఫలం సంచిత కర్మ ఖాతాకు బదిలి చేయబడతాయి. ఈ సంచిత కర్మల నుండి మరలా కొంత భాగం ప్రారబ్ధకర్మ గా తీసుకుని కొత్త జన్మ ఏర్పడుతుంది. ఇలా సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు నిరంతరం కొనసాగటం వలన జనన మరణాలు పునరావృతమవుతుంటాయి. ఈ చక్రం నుండి బయట పడటమే మోక్షం.

**ప్రశ్న : ప్రాయశ్చిత్త కర్మలు అనగానేమి?**

**జవాబు :** ఎవరైనా జీవితంలో అపరిమితమైన కష్టాలు అనుభవిస్తున్నారంటే ప్రారబ్ధ పాప ఫలంగా గుర్తించవచ్చును. ఈ దోష నివారణ కోసం అంటే కష్టాలు తొలగటానికి చేసే పుణ్యకర్మలు ప్రాయశ్చిత్త కర్మలుగా పిలవబడతాయి. ప్రాయశ్చిత్త కర్మలు చేయటం వలన పాప పరిహారమవుతుంది. లేదా తీవ్రత కొంత నివారించవచ్చును. తప్పని సరిగా అనుభవించవలసిన ప్రబల పాపం ఉన్న యెడల, ఆపరేషన్ జరుగుచున్న సమయంలో ఎనస్తీషియా ప్రభావంలా, చేస్తున్న దైవపూజలు, దాన ధర్మాలు పాప ఫలం యొక్క నొప్పి తెలియకుండా చేస్తాయి.

**ప్రశ్న : సజ్జన సాంగత్యం వలన ఉపయోగం ఏమిటి?**

**జవాబు :** మనుషులు ఒకరి వలన ఒకరు ప్రభావితమవటం అనేది అందరూ అంగీకరించగల వాస్తవం. పూలతో సాంగత్యం చేసిన దారానికి కూడా సువాసన అబ్బినట్లే సజ్జనులతో కలసిమెలసి తిరగటం వలన లేదా సన్నిహితంగా మెలగటం వలన వారియొక్క సాత్విక అలవాట్లు ఆలోచనలు కొన్నైనా వంటబడతాయి కదా! ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారని సామెత. పెళ్లయ్యాక జీవిత భాగస్వామి ప్రభావం వలన మారిన వారిని మీ స్నేహితులలో, బంధువులలో గమనించే ఉంటారు. ఏదైనా నిరంతర సాధన ద్వారా మంచి మార్పుకోసం అందరమూ ప్రయత్నించవలసిందే! సజ్జనులు ఎక్కడ ఉంటారు, వారి చిరునామా ఎలా తెలుసుకోవటమనేది ఏమంత పెద్ద సమస్య కాదు. ***వీధిన వెళ్తుంటే (కాంపౌండ్ వాల్) ప్రహరీగోడ ఆవల ఉన్న సన్నజాజి పందిరి తన పరిమళం ద్వారా తన ఉనికిని తెలియజేసినట్లు సంకల్పబలం ఉంటే అన్నీ అవే తెలుస్తాయి.*** మార్పుకోసం జిజ్ఞాసతో అన్వేషణ జరిపే వ్యక్తికి జగత్తు మార్గం చూపిస్తుంది. ఎదురైన సంఘటనలను, తారసపడిన వ్యక్తులను, పరిచయమైన స్నేహితులను కొత్తకోణం నుండి పరిశీలించటం సహజంగానే అలావాటవుతుంది. చదివే పుస్తకాలు, చూసే సినిమాలలోని కొన్ని పాత్రలు కూడా ఎంతోకొంత నేర్పించగల్గుతాయి. దారిన పోతుంటే చెవిన బడే సంభాషణలలో కూడా కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. మన చుట్టూ రోజూ సాధారణంగా కనిపించే మనుషులలో కూడా అసాధారణ విషయాలు వెల్లడవుతాయి. జీవితంలో అద్భుతమైన మార్పుకు ఇవన్నీ దోహదపడతాయి. దృక్పథం మారితే దానికి తగినట్లుగా మొత్తం మారిపోవటం ఈ విశ్వంలో ఉన్న కీలక అంశం. అప్పుడు చెట్టు, పుట్ట, పిట్ట, కట్టే అన్నీ కూడా తమ భాషలో ఎన్నో విషయాలు నిశ్శబ్దంగా చెబుతూనే ఉంటాయి. మారిన మనసుకు ప్రకృతి భాష తెలుస్తూనే ఉంటుంది. భావాలకు పరిశుద్ధత తోడైతే సంపూర్ణానందానికి తలుపులు తెరుచుకుంటాయి.





ఇంకా సజ్జన సాంగత్యం వలన ఒనగూడు ప్రయోజనాలు ఎన్నెన్నో ఉన్నాయి. అన్నింటికన్నా ముఖ్యమైన క్రమశిక్షణ, దైవపూజ, వివేకం, ధర్మం, క్షమ, కరుణ, సత్యం, ప్రియ భాషణ, మానవత్వం, పరోపకారం మొదలైన వాటి పట్ల అనురక్తి ఏర్పడి ఆ గుణాలను తమలోకి ఆహ్వానించుకుంటారు. తద్వారా విశాల దృక్పథం అలవడి సత్కర్మలు మాత్రమే ఆచరిస్తారు. అంటే కొత్తగా చేసే ఆగామి కర్మలన్నీ పుణ్య కర్మలు, శుభ కర్మలు అని అర్థం. ఈ విధంగా కూడా ప్రారబ్ధ పాపకర్మల ఋణం తీరి సమీప భవిష్యత్తులో జ్ఞానాన్వేషణకు సులభ మార్గమేర్పడుతుంది.

**ప్రశ్న : మారాలనుకుంటున్న వ్యక్తికి, ప్రారబ్ధకర్మ కారణంగా ఆటంకాలు ఎదురు కావా?**

**జవాబు :** ఇది చాలా మంచి ప్రశ్న. ప్రారబ్ధకర్మ, ఆగామి కర్మ సమాంతరంగా కొన సాగుతుంటాయి. కాబట్టి మీ ప్రయత్నం విఫలమైన యెడల, అది మీ యొక్క ప్రారబ్ధ ఫలితంగా భావించి మీరు కోరిన ఫలితం వచ్చేంత వరకు మరల మరల మరల ప్రయత్నించవలసిందే! రామ నామంలాగా "నిరంతరం" అనే పదం గుర్తుంచుకోండి. చర్యకు ప్రతి చర్య ఉంటుంది. ఇది ప్రకృతి సూత్రం. మీరు చేసే పనులన్నింటికీ ఫలితం ఖశ్చితంగా ఉంటుంది. ఫలితం రావటంలో ముందు వెనుకలు ఉంటాయి గావున, ఫలితం కోసం ఎదురు చూడటంలో కాలయాపన చేయక నిరంతర ప్రయత్నం నిర్విరామంగా కొనసాగించవలసిందే.

ప్రబల ప్రారబ్ధ కర్మ ఉన్న యెడల ప్రయత్నాలు ఫలించక నిరాశ నిస్పృహలు ఎదురవుతుంటాయి. సంతోషంగా ఉన్న తోటి వారిని చూసి ఈర్ష్య అసూయలకు గురిగాకుండా సాధనచేస్తూ కర్మ సిద్ధాంత అధ్యయనం వలన కలిగిన జ్ఞానంతో

ఓర్పుతో కష్టాలను తట్టుకుని ఆగామి పుణ్యకర్మలు, సాత్విక కర్మలు చేయవలసిందే. అప్పుడే కష్టాల నుండి విముక్తి లభిస్తుంది.

**ప్రశ్న : ఎక్కడైనా బలవంతుడిదే పై చేయి. అది కులం వలన గావచ్చు. డబ్బు వలన గావచ్చు. అధికారం వలన గావచ్చు. ఎంతకాదనుకున్నా బలహీనులు పాప పుణ్యాలు, కర్మ-అని మెతక మాటలు చెబుతారని లోకంలో కొంతమంది అనుకుంటున్నారు. దీనికి మీరు ఏం సమాధానం చెబుతారు?**

**జవాబు :** అలా అనుకునే ఆ కొంత మందిలో మీరూ ఉండవచ్చు లేదా మీరు లేకపోవచ్చును. అయినప్పటికీ ఈ విధమైన అపోహలను తొలగించి కర్మ సిద్ధాంతం యొక్క శక్తి గురించి మీకు విశదీకరించవలసిన బాధ్యత నా మీద ఉంది.

కొట్టిన వాడు కొట్ట బడతాడు. తిట్టిన బడిన వాడు తిట్ట బడతాడు. అవమానించిన వాడు అవమానింపబడతాడు. మోసం చేసిన వాడు మోసగింప బడతాడు. ఇది ప్రకృతిలో ఉన్న అనివార్యమైన చర్య-ప్రతి చర్య సూత్రం. విశ్వంలో సూర్యాది గ్రహాలు, భూమి నిరంతరం ఒక నియమం ప్రకారం ఏ విధంగా సంచరిస్తున్నాయో అదే విధంగా కర్మ సిద్ధాంతం కూడా ఒక నియమం. ఈ విషయాలకు మీ అనుభవమే ప్రమాణము. ఇతరుల అనుభవాన్ని మీరు నమ్మనవసరం లేదు.

బలవంతుడిదే పై చేయి అన్నారు. ఎవరు బలవంతుడు? సినిమాలలో హీరో నడిబజార్లో అందరిని కొట్టి ఇంట్లోకి వచ్చి నిశ్చింతగా నిదురపోతాడు. నిజ జీవితంలో మీరు గాని మరొకరు గాని ఎందుకోసమైనా గాని ఎవరినైనా కొట్టి ఆదమరచి నిదురపోగల సదుపాయం ఉందా? భయంతో ఎక్కడో ఒక చోట దాక్కోవటమో, మరో నలుగురిని వెంట వేసుకుని అనుక్షణం అభద్రతతో సంచరించటమో చేస్తారు. భయపడే వాడు బలవంతుడెలా అవుతాడు? రాజకీయ





పదవులలో ఉన్న అనేక మంది నోరు పారేసుకున్న మరుక్షణమే ప్రత్యర్థులు వారిపై ఎదురు దాడి చేసి అంతకు పదింతలు తిట్టడం కూడా మీరు టీ.వి.లలో చూస్తున్నారుగా. ఇలా తిట్టి తిట్టించుకోవడం, సంఘర్షణకు గురవటం, ఉత్పాదక కాలం నిరుపయోగంగా వెచ్చించటం పై చేయి ఎలా అవుతుంది?

ఒక పౌరుడిగా తహశీల్దారు ఆఫీసునుండి రైతు పాస్ బుక్కు తీసుకునే హక్కుందన్న సంగతి విస్మరించి, అధికార పార్టీ కార్య కర్తగా ఆ పని పూర్తి చేసుకుని, ఏదో సాధించానని విర్రవీగడం వెనుకబాటుతనం కాదా! ఇది "పై చేయి" గా మీరు భ్రమ పడుతున్నారు.

కట్టు దిట్టమైన భద్రతావలయంలో సురక్షితంగా ఉండే మన ముఖ్యమంత్రి మీద గతంలో హత్యా ప్రయత్నం ఎలా జరిగింది? పురుచ్చి తలైవి బిరుదాంకితురాలు తమిళనాడు ముఖ్యమంత్రి జైలు పాలు ఎలా అయింది? డబ్బు అధికారం ఉన్న ఎం. ఎల్. ఎ. స్టాంపు కుంభ కోణంలో నిందితుడుగా ఎలా పట్టుబడ్డాడు? ప్రస్తుత ప్రతిపక్ష నేత ఎంతో అంగబలం, అర్ధబలం ఉండి కూడా కొంత కాలం జైలులో ఎందుకు ఉండవలసి వచ్చింది? కులం దే పై చేయి అనుకుంటే నిందితులుగా కేసులు ఎదుర్కొంటున్న అనేక మందిని సాటి కులస్థులు ఎందుకు రక్షించటం లేదు? ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ఉదాహరణలే ఒక పుస్తకం అవుతుంది.

తెల్లవారి లేస్తే ఎన్ని ఉదంతాలు మీకు కన్పించటం లేదు? సమాజంలో సాంఘీక కట్టు బాట్లున్నాయని, వీటికి అతీతంగా "వ్యక్తి" ఎప్పుడూ ఏ విధంగా బలవంతుడు కాదని మీరు తెలుసుకావాలి. అయినా "కర్మ సిద్ధాంతం" నమ్మే వారికి డబ్బు ఉండదని, అధికారం, పదవులు రావని మీరు ఎందుకు అనుకుంటున్నారు? లేదా డబ్బు, అధికారం ఉన్నవారికి కర్మ సిద్ధాంతం అంటే ఏమిటో తెలియదని మీరు అనుకుంటున్నారా?

విశ్వంలో భూమి పరిమాణం ఎంత? భూమ్మీద మన దేశం, అందులో మన రాష్ట్రం, మన జిల్లా, మన ఊరు, మన ఇల్లు ఎంత, ఎంత, ఎంత? ఇంట్లో ఒక ఆరడుగుల ఆకారం మనది. ఇప్పటికి లక్షల కోట్ల మనషులు మరణించారు. వారు ఇక్కడ కొంత కాలం ఉన్న ఆనవాళ్లు కూడా లేవు. టీ. వి. చూస్తుంటే తెలిసిపోతుంది. నిర్విరామంగా మరణవార్తలు. నిన్న ఈ సమయంలో కూడా వారున్నారు. కొంతమంది గంట క్రితం వరకు కూడా సజీవంగా ఉన్నారు. మర్నాడు తాము ఉండబోమని వాళ్లు అనుకున్నారా? ఏదో ఒకరోజు మనవంతూ వస్తుంది. ఇల్లు, కారు, బ్యాంకు బ్యాలన్సు, బంధాలు అనుబంధాలు అన్నీ వదిలేసి పోవలసిందే! ఒంటరిగా వచ్చి ఒంటరిగా పోయే మనకు పై చేయి గొడవ ఎందుకు?

మనందరం దేవుని బిడ్డలం అంటుంది క్రైస్తవ మతం. పరమాత్మలో ఉన్న అంశ మానవులందరిలో ఉందని హిందూమతం చెబుతోంది. ఇంచుమించుగా మనకు తెలిసిన అన్ని మతాలు ఈ అంశాన్ని బలపరుస్తున్నాయి. నా చిన్న తనంలో తెలిసీ తెలియని రోజుల్లో మనమంతా దేవుని బిడ్డలం అనే నిజాన్ని వ్యంగ్యంగా వెటకారంగా స్నేహితులతో కలసి వినోదించేవాడిని. అందులో చాలా నిగూడార్థం ఉందని తర్వాత కాలంలో తెలుసుకుని గతంలో నా వెనుకబాటుతనానికి పశ్చాత్తాప పడ్డాను.

ఈ పుస్తకం పూర్తిగా చదివాక మీరు కొత్త అనుభూతికి లోనవుతారు. గతంలో చాలా సార్లు ఏదో ఒక విషయం గురించి మీ మనస్సు సంఘర్షణపడి ఉండవచ్చును. పలు పర్యాయాలు ఇతరుల పట్ల అసంతృప్తితో దిగులుపడి ఉండవచ్చు. ఏదో చెప్పుకోలేని బాధలు, సందిగ్ధాలు ఏమైనా ఉండి ఉంటాయి. అదంతా గతం. ఇప్పుడిక అంతా సంతోషమే. ఎందుకంటే సుఖ దు:ఖాల





మర్మం ఏమిటో, అసలు రహస్యం కర్మ సిద్ధాంతమేనని మీరు తెలుసుకుంటారు.

చేసుకున్న వారికి చేసుకున్నంత అనే నానుడి ప్రారబ్ధకర్మను అనుసరించి అభివృద్ధి చెంది వాడుకలోకి వచ్చిన లోకోక్తి. అందువలన వేలకోట్ల మానవులున్నప్పటికీ, జీవన ప్రమాణాలలో ఆర్థిక పరిస్థితులలో ప్రారబ్ధ కారణంగా ఏ ఇద్దరి జీవితమూ ఒక్కలా ఉండదు. కంటికి కనిపించే సమస్త ప్రాపంచిక ఐశ్వర్యాల వెనుక పరోక్షంగా ఉన్న అంశము ధర్మమే!

మీరు ఈనాడు చూస్తున్న ప్రముఖులంతా ఒకనాడు సామాన్య కుటుంబాలలో జన్మించిన వారే! వారి వారి గత జన్మల పాప పుణ్యాలననుసరించి, ప్రస్తుతం ఫ్రీవిల్‌తో వారు చేస్తున్న ఆగామి కర్మలను అనుసరించి వారి సంతోష దు:ఖాలు, అభివృద్ధి, విజయాలుంటాయి. వారి క్రియలన్నింటి వెనుక వారి యొక్క "సంకల్పం" ఉంటుంది. లక్ష్యం ఉంటుంది. అందుకే వేదంలో చతుర్విధ పురుషార్థాల గురించి చెప్పబడింది. విషయ విస్తీర్ణత ఉండకూడదని, అదీగాక ఇది కేవలం పరిచయ పుస్తకం గావున, అన్న ప్రాసన నాడే ఆవకాయ సబబు కాదని, వేదాంతంలోని ముఖ్యమైన అంశాలు ఇక్కడ వివరంగా చెప్పటం లేదు.

చివరగా ఒక మాట. ఇతరుల మీద "పై చేయి" అని ఆలోచించినంత కాలం ఏ వ్యక్తికీ ఎదుగుదల ఉండదు. "విశ్వం" మనందరి అర్హతలు నిర్ణయిస్తుంది. ***తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారనే ఆలోచనా విధానంలో జీవిస్తూ, అనుక్షణం పోల్చుకుంటూ బ్రతికే వారికి ఎన్నటికీ మన:శ్శాంతి ఉండదు.*** సైకాలజిస్టులు "కండీషన్డ్ మైండ్" అన్నా, ఆధ్యాత్మికతలో బంధం అన్నా ఇదే. ఇలాంటి వారు ఎల్లకాలం తీవ్రమైన ఉద్వేగాలకు గురవుతూ పక్కనున్న వారిని ఆ రొంపిలోకి లాగుతుంటారు. ప్రవచనాలకు వెళ్లినా, ప్రార్థనలు చేసినా వీరిదంతా డాంభికమే! వీరంతా బలహీనులే.

తనను తాను తెలుసుకుని, ఆత్మ పరిశీలన చేసుకుంటూ, తన

పరిమితులను అర్థం చేసుకుని, నిరంతరం వివేకం, మానవత్వం, దయ, కరుణ, క్షమ, ప్రేమ మొదలైన సాత్విక లక్షణాలతో జీవించే వారంతా బలవంతులే. ***నిజం చెప్పాలంటే పరిచయ పుస్తకం కాబట్టి మీకు అర్థం కావటానికి "బలవంతులే" అని సంభోదించాను. నిజంగా అలా జీవించే వారు తాము బలవంతులమని ఊహల్లో కూడా అనుకోరు.***

**ప్రశ్న : అంతా బాగానే ఉంది. అసలు గత జన్మ ఉందని, మనతోపాటు పాపపుణ్యాలు వెంటతెచ్చుకున్నామని ఎలా నమ్మాలి?**

**జవాబు :** "ఈ టీ.వి."లో పాడుతా తీయగా పాటల కార్యక్రమం మీరు చూసి ఉంటారు. ఒకవేళ చూడకపోతే పరిశీలన కోసం ఒకసారి చిన్న పిల్లలు పాడిన పాత వీడియోలు "యూ ట్యూబు"లో చూడండి. అలాగే లిటిల్ ఛాంప్స్ అనే కార్యక్రమం కూడా ఉదాహరణగా స్వీకరించ వచ్చును – అంత చిన్న వయస్సులో ఆ పిల్లలు అంత అద్భుతంగా ఎలా పాడుతున్నారు? ఎంత సాధన చేసినప్పటికీ వారి వయస్సుకు అంత సంగీత పరిజ్ఞానం అబ్బే అవకాశం ఉందంటారా? అంటే సదరు బాల బాలికలందరూ వారి వారి గత జన్మలో సంగీతంలో కొంత సాధన చేసి, ఆ జ్ఞానాన్ని పుడుతూ వెంట తెచ్చుకున్నారని అర్థం అవుతుంది గదా!

ఇదేదో ఒక సిద్ధాంతాన్ని నమ్మి దానికనుగుణంగా సంఘటనలను అన్వయించుకుని, ఒక తార్కికమైన వాదన నిర్మించుకోవటంలా మీరు భావించనవసరం లేదు. ఎందుకంటే ఒక్క సంగీతమే కాదు, ఏ విద్య అయినా ఎంత సాధన చేసినప్పటికీ అతి చిన్న వయస్సులో రాణించే అవకాశం ఎంత మాత్రం లేదు. మనకు ఏ మాత్రం సంబంధంలేని విద్యలు ఒకటి రెండు సంవత్సరాలు అభ్యసించి, ఇంగిత జ్ఞానం ఉన్న పెద్ద వయస్సు వారమైన మనం





ఏమాత్రం రాణించగలమంటారు? స్వరాలు నేర్చుకుని పాడటం వేరు. పాడి మెప్పించటం వేరు. అదే విధంగా మెరుపు వేగంతో డ్యాన్సు చేస్తున్న బుడతలు. వీటి అన్నింటి వెనుకా గత జన్మ సాధన ఉందని మనం నమ్మవలసిందే! ఇలా నమ్మటమే సంభావ్యతా సిద్ధాంతం. కనిపించే అంశాలను చూసి ఇలాగే జరిగి ఉంటుందని విశ్వసించటం.

మరొక ముఖ్య విషయం ఏమంటే, తాళపత్ర గ్రంధాలు. తమిళనాడులోని వైదీశ్వరన్ కోయిల్ వీటికి ప్రసిద్ధి. తర్వాత కాలంలో అక్కడి నుండి హైదరాబాదు లాంటి నగరాలకు అనేక మంది నాడీ రీడర్సు వచ్చి ఇక్కడ శాఖలు స్థాపించి అనేక మందికి వారి సేవలందించారు. మన గురించి వారికి తెలియదు గదా! నేను హైదరాబాదులో ఉండగా "కళ్యాణ సుందరం" అనే నాడీ జోతిష్కుని వద్దకు వచ్చే వందలాది మందిని వ్యక్తిగతంగా సంప్రదించి వారిని ఇంటర్వ్యూ చేసి వివరాలు రాబట్టాను. నా జాతక చక్రం తాటాకు మీద లిఖించి ఉండటం నేను స్వయంగా పరీక్షించాను. మన ఋషులు రాసినవిగా చెప్పబడుతున్న ఈ తాళ పత్రాలలో పూర్వ జన్మ వృత్తాంతం కూడా ఉంటుంది. పూర్వ జన్మ ఏమై ఉంటుందనే సంగతికి ఋజువులు లేకున్నా, అసలు గత జన్మ ఉందని, ఇలాంటి అద్భుత విషయాలు జీవితంలో తారసపడినప్పుడు నమ్మవలసిందే మరి. కావున చిన్న పిల్లలు అసమానమైన ప్రతిభా పాటవాల వెనుక పూర్వ జన్మ సాధన ఉందని విశ్వసించి తీరాలి. జాతక చక్రంలో వక్రించిన గ్రహాలు "పూర్వ జన్మ" ను తెలియజేస్తాయని (సూచిస్తాయని) జ్యోతిష శాస్త్రం చెబుతుంది.

అదేమిటి ఒకవేళ గత జన్మలో వారికి సదరు ప్రతిభ ఉన్నప్పటికీ ఈ జన్మలో ఏ విధంగా వెంటతెచ్చుకుంటారు? వచ్చేటప్పుడు సూటుకేసులో బట్టలు తెచ్చుకొన్నట్లు ఏదైనా సౌకర్యం ఉందా అని మళ్లీ మీరు వెటకారంగా ప్రశ్నిస్తారు.

ఇది మీకు అర్ధం కావాలంటే శరీర త్రయం గురించి, మన శరీరం పాంచ భౌతిక శరీరమనే విషయాల గురించి స్వల్పంగానైనా తెలుసుకోవాలి. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం-వీటిని పంచ భూతాలంటారు. అంటే ఐదు స్థూల పదార్ధాలని అర్ధం. శరీర త్రయం అంటే మనిషికి ఉండే మూడు రకాలైన శరీరం అవి 1) స్థూల శరీరం 2) సూక్ష్మ శరీరం 3) కారణ శరీరం.

పైన చెప్పిన పంచ భూతాల కలయిక వలన స్థూల శరీరం ఏర్పడుతుంది. అందువలనే దీనిని పాంచ భౌతిక శరీరమంటారు. శరీర భాగాల రూపంలో భూమి; శరీరానికి ఆకృతినిచ్చే ద్రవ రూపంలో నీరు; శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల రూపంలో అగ్ని; శరీరంలో ఉశ్వాస నిశ్వాసలరూపంలో వాయువు; శరీరం ఆక్రమించిన స్థానం ఆకాశం; (ఆకాశం అంటే శూన్యం) రెండో శరీరాన్ని సూక్ష్మ శరీరమంటారు. సూక్ష్మ పంచ భూతాల నుండి తయారుచేయబడింది సూక్ష్మ శరీరం.

ఈ సూక్ష్మ శరీరంలో పంచ జ్ఞానేంద్రియాలు (కళ్లు, చెవి, ముక్కు, నాలుక, చర్మం), పంచ కర్మేంద్రియాలు (వాక్కు, చేతులు, కాళ్లు, పాయము, జన నాంగము), పంచ ప్రాణాలతో పాటు మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే నాలుగు అంత:కరణాలున్నాయి.

కన్ను స్థూల శరీరానికి సంబంధించినదైతే కంటి చూపు సూక్ష్మ శరీరానికి సంబంధించినది. చెవి స్థూల శరీరానికి సంబంధించినదైతే వినికిడి శక్తి శూక్ష్మ శరీరానికి సంబంధించినది. ఇదే విధంగా ముక్కు స్థూల శరీరం; వాసన సూక్ష్మ శరీరం; నాలుక స్థూల శరీరం; రుచి సూక్ష్మ శరీరం; చర్మం - స్పర్శ. ఇవి జ్ఞానాన్నిచ్చే ఇంద్రియాలు గావున పంచ జ్ఞానేంద్రియాలన్నారు. కర్మలు (పనులు) చేయటానికి ఉపయోగ పడే ఇంద్రియాలను పంచ కర్మేంద్రియాలటారు. పంచ ప్రాణాలంటే శ్వాస, అపాన, ద్యాన,సమాన, ఉదాన ప్రక్రియలు ( విషయ విస్తీర్ణ





భీతిచేత వీటి గురించి లోతుగా విశదీకరించటం లేదు)

మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాలను నాలుగు అంత:కరణాలని చెప్పుకున్నాం. భావోద్రేకాలు, అన్ని రకములైన ఆలోచనలకు మూలం మనస్సు. విచక్షణ, విశ్లేషణ, తార్కిక శక్తి బుద్ధికి సంబందించినవి. అనేక జ్ఞాపకాల నిలయం చిత్తం. తన గురించి తాను చెప్పుకునే శక్తి అహంకారం. నిజానికి ఈ నాలుగు మనస్సు యొక్క బహుకృత రూపాలే. అంటే లౌకిక పరిభాషలో చెప్పాలంటే ముఖ్యమంత్రికే అదనంగా మరో మూడు మంత్రిత్వ శాఖలున్నట్లుగా అర్ధం చేసుకోండి. అంటే ఆయా పనులను బట్టి మనస్సే ఒకసారి మనస్సు గాను, మరొక సారి బుద్ధిగాను వేరొకసారి చిత్తం అహంకారాలగాను సమయానుకూలంగా పని చేస్తుంది.

స్థూల శరీరానికి షుమారు వందేళ్ల ఆయుష్షు అయితే, సూక్ష్మ శరీరం ఈ సృష్టి ఉన్నంతకాలం ఉంటుంది. అందుకే మన ఉద్వేగాలు, ఆలోచనలు అన్నీ విశ్వంలో అలాగే కొనసాగుతుంటాయి. సులభంగా అర్ధం గావటానికి మన టీ. వి. పరికరాన్ని స్థూల శరీరంగా భావించండి. మనకు టీ.వి. లేకున్నా గాలిలో మనకు కనిపించకుండా వేలాది చానళ్ల ప్రసారాలు, కార్యక్రమాలున్నాయని మీకు తెలుస్తుంది కదా! ఈ ప్రసారాలను సూక్ష్మ శరీరం అనుకోండి. టీ. వి. ఉంటే ఈ ప్రసారాలు వ్యక్తమయినట్లుగా స్థూల శరీరం ఉంటే అన్ని ఉద్వేగాలు, భావాలు వ్యక్తమవుతాయి. మనస్సు, భావాలు, ఆలోచనలు ఎవరివి వారికి తెలుస్తాయి. ఇతరులకు కనిపించవు. ఎదుటి వారికి మన స్థూల శరీరం కనిపిస్తుంది. సూక్ష్మ శరీరం కనిపించదు. సూక్ష్మ శరీరానికి మరణం లేదు.

కారణ శరీరం కారణ పదార్ధంతో తయారుకాబడుతుంది. కారణమంటే ఇక్కడ మాయ అని అర్ధం. స్థూల శరీరం అందరి కంటికి కనిపిస్తుంది. సూక్ష్మ

శరీరాన్ని ఎవరికి వారే చూడగలరు. కారణ శరీరం ఎవరికీ తెలియదు. దీనినే ప్రకృతి అని పిలుస్తారు. కారణ శరీరం గురించి మరింత లోతుగా తేలుసుకోవాలని ఆసక్తిగలవారు మహనీయులు రాసిన వివిధ ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలు పరిశీలించవచ్చును. సూక్ష్మ శరీరం అంటే కొద్దిగానైనా అవగాహన లేకుండా, సూక్ష్మ శరీరం మరణించదు, అని చెప్పటం వలన పాఠకులకు గందరగోళంగా ఉంటుందని, శరీరత్రయం గురించి కేవలం సూచన ప్రాయంగానే తెలియజేసాను.

ప్రస్తుత విషయం గతజన్మ. స్థూల శరీరం శిధిలమైనా, సూక్ష్మ శరీరం జీవించే ఉంటుందిగావున గతజన్మ వాసనలు అంతర్గతంగా ఉండి బాహ్యజగత్తులో అందుకు సంబంధించిన విషయాలు తారసపడినప్పుడు కొద్దిపాటి సాధనకే ఆ ప్రతిభా పాటవాలు వ్యక్తీకరింపబడతాయి. ఇదీ అసలు రహస్యం.

ప్రశ్న : **కర్షకులకు, కార్మికులకు స్వల్ప వేతనాలు చెల్లించి, వారి శ్రమను దోచుకుంటూ తాము మాత్రం సుఖంగా జీవిస్తున్న పెట్టుబడి దారులు, పేదరికం అనుభవిస్తున్న కష్టజీవులు తమ మీద తిరగబాటు చేయకుండా ఉండేందుకు "మీ కర్మ ఇలా ఉంది" అని వాళ్ల నోళ్లు మూయించటానికి "కర్మ సిద్ధాంతం" ప్రచారంలోకి తెచ్చారని ఒక వర్గం వారు అంటున్నారు. దీనికి మీరేమంటారు?**

**జవాబు :** కర్మ సిద్ధాంతం అతి ప్రాచీనమైనది. క్రీస్తు పూర్వం 1500 శతాబ్ధం నాటికే కర్మ సిద్ధాంతం మనుగడలో ఉంది. హిందూ మతంతో పాటు జైన, బౌద్ధ మతాలు కూడా కర్మ సిద్ధాంతానికి ప్రాముఖ్యతనిచ్చాయి. ఇండియాలోనే గాక ఆసియా దేశాలన్నింటిలో కర్మ సిద్ధాంతానికి ఆదరణ ఉంది.

మీరు చెబుతున్న పెట్టుబడిదారి వ్యవస్థ ఇటీవలి కాలానికి చెందినది





కావున పెట్టుబడిదారులు పేదవారి నోరు మూయించటానికి "కర్మ సిద్ధాంతం" ప్రచారం చేస్తున్నారనటం హాస్యాస్పదంగా ఉంది. ***టెక్నాలజీ అభివృద్ధి చెంది, దేశాల మధ్య ఎల్లలు చెరిగిపోయి ప్రపంచమే ఒక గ్రామంగా మారిపోయిన ఈ ఆధునిక యుగంలో ఎదగాలనుకునే వ్యక్తిని ఏ శక్తి ఆపలేదు. ఏ ఇజమూ బంధించలేదు.*** అసలు కర్మ సిద్ధాంతాన్ని అర్ధం చేసుకున్న వారెవరూ ఈ విధంగా ఆక్షేపించరు. సందేహనివృత్తి చేయటం నా ధర్మం కాబట్టి, ఈ ప్రశ్నకు కూడా జవాబు ఇస్తున్నాను.

నీ గత జన్మ ప్రకారం నీ ప్రస్తుత జన్మ ఉంటుందని మాత్రమే కర్మ సిద్ధాంతం చెప్పటం లేదు. నీ మంచి చెడులకు నీవే బాధ్యుడవు అనే నియమం చెబుతూ, ఐనప్పటికీ ఫ్రీ విల్ లో ఆగామి సత్కర్మలు చేసే మానవ ప్రయత్నాన్ని ప్రోత్సహించింది. చేసిన తప్పులకు జన్మ మారినా శిక్ష తప్పదని హెచ్చరిస్తూ గతంలో చేసిన పాప ఫలాలు తొలగించుకోవటానికి ప్రాయశ్చిత్త కర్మలను సూచించింది. అంటే గత జన్మలో చేసిన పొరపాట్లు సవరించుకోవటానికి ఇప్పుడు ప్రయత్నంతో తన భవిష్యత్తు నిర్మించుకోవటానికి "కర్మ సిద్ధాంతం" వీలు కల్పించింది.

సమాజంలో విశృంఖలతను అరికట్టి, మానవ జాతి పురోభివృద్ధికి తోడ్పడే నైతిక ప్రకృతి చట్టమే కర్మ సిద్ధాంతం. అటు సోమరి తనాన్ని ఇటు ఆటవిక న్యాయాన్ని ప్రోత్సహించకుండా ఇతరుల శ్రమను దోచుకోవటం తప్పని, ఇతరులను కించపరచటం తప్పని, సోంబేరిగా కూర్చుని తినటం తప్పని, మనుషులంతా ఒక్కటేనని చెబుతూ ధర్మబద్ధంగా సంపాదించటాన్ని ప్రోత్సహించింది.

జనాభా విపరీతంగా ఉన్న ఇండియాలో, కర్మ సిద్ధాంతమే లేకుంటే కేవలం ప్రభుత్వ చట్టాలతో అన్యాయాలు, అక్రమాలు అరికట్టడం

సాధ్యపడుతుందా? అందరూ తినటం, త్రాగటం, నచ్చిన స్త్రీని అనుభవించటం, ఇళ్ల మీద పడి లూటి చేయటం ప్రారంభించితే అరాచకం ప్రబలిపోదా? అప్పుడు కొద్దిపాటి పోలీసు బలగాలున్న ఏ ప్రభుత్వమైనా ఏం చేయగలదు? పాపభీతి, దైవ భక్తి ఇంకా మన దేశంలో ప్రజలలో ఉండబట్టి సమాజం ప్రశాంతంగా ఉంది. ఇప్పటికే మానవ సంబంధాలు దెబ్బతిని, అయినవాళ్లు, ఆత్మీయులు, బంధువులు అనే భావాల స్థానంలో స్వార్థ చింతన, అహం రాజ్యమేలుతున్నాయి. ***ఈ పరిస్థితులలో కర్మ సిద్ధాంతం ఆత్మ జ్ఞానాలు యొక్క ఆవశ్యకత ఎంతో ఉంది. ధర్మాన్ని నీవు పాటించితే, నిన్ను ధర్మమే కాపాడుతుందనే హిందూ ధార్మిక సూక్తి మనందరికీ ''శిరోధార్యం''.***

**ప్రశ్న : కర్మ సిద్ధాంతానికి జ్యోతిష శాస్త్రానికి సంబంధం ఉందా?**

**జవాబు :** మానవ జన్మకు మూలం ప్రారబ్ధకర్మని, వెంటతెచ్చుకున్న పాప పుణ్యాలను అనుభవించిన పిదప మరణం సంభవిస్తుందని మనం ఇంతకు ముందు తెలుసుకున్నాము. పుట్టిన తేది, సమయం, ప్రదేశం వ్యక్తి జన్మ వివరాల ఆధారంగా నిర్మింపబడు జాతకచక్రం ద్వారా అతని నైతిక ప్రవర్తన, మానసిక పరిస్థితి, ఉద్రేకం, తెలివి, వివేకం, ప్రేమ, పూర్వజన్మ పుణ్యం, వృత్తి మొదలైన విషయాలతో పాటు దశ అంతర్దశలను బట్టి అతనికి ప్రాప్తించబోయే శుభ అశుభ ఫలితాలు తెలుసుకోవచ్చును. జ్యోతిష శాస్త్రమంటేనే వెలుగునిచ్చే శాస్త్రమని భావం.

నిపుణులైన జ్యోతిష్కులను సంప్రదించి దోష నివారణకు ప్రాయశ్చిత్త కర్మలు తెలుసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చును. జ్యోతిష్కుల ప్రతిభా పాటవాలలో తేడాలుండవచ్చునేమో గాని, జ్యోతిషశాస్త్రం విశ్వసించదగినదే. కర్మ సిద్ధాంతం కేవలం "సిద్ధాంతం'' చెబితే, జ్యోతిషశాస్త్రం





ప్రత్యక్ష నిదర్శనాలను చూపిస్తుంది. ఈ రెండింటికీ విడదీయరాని సంబంధముంది.

**ప్రశ్న : ఎలుక తోలు తెచ్చి ఎందాక ఉతికిన, నలుపు నలుపే గాని తెలుపు రాదు-అని వేమన పద్యం ఉంది. కర్మ సిద్ధాంతం మీరు పరిచయం చేసినంత మాత్రాన అందరికీ బుర్రకెక్కుతుందా?**

**జవాబు :**

అనగ అనగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తీయగనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వధాభి రామ వినురవేమ

ఇది కూడా వేమన పద్యమే. పాడగ పాడగ రాగం వృద్ధి అవుతుంది. తినగ తినగ వేపాకు కూడా తియ్యగా ఉంటుంది. అలాగే దృఢ సంకల్పంతో పట్టుదలతో చేపట్టిన పని చెయ్యగా అది తప్పకుండా సమకూరుతుందని భావం.

మీరు ఉదహరించిన పద్యం మూర్ఖునికి ఎంత చెప్పినా వినిపించుకోడనే భావంతో వేమన తెలిపారు. ప్రయత్నించే వాడికి అన్నీ సాధ్యమవుతాయి అనే భావంతో వేమన తెలిపిన పద్యాన్ని నేను ఉదాహరణగా తీసుకున్నాను. అయినా నేను వ్యక్తిగతంగా కలసి ఎవ్వరికీ చెప్పటం లేదు. ఒక పుస్తకం రాస్తున్నాను. ***కొంత మంది జీవితాలకు ఇది శుభారంభం కావాలనే శుభ సంకల్పంతో ఈ పుస్తకానికి ఆ పేరు పెట్టాను. ఇలాంటి ఒక పుస్తకం అవసరంగా భావించిన "విశ్వం" నా చేత రాయించి, సాటి వారికి ఈ విధంగా కృతజ్ఞతలు చెప్పే అవకాశం నాకు కల్పించింది. ఇది ఎవరు చదవాలో ఇప్పటికే విశ్వం నిర్ణయించి ఉంటుంది.***

**ప్రశ్న : ప్రాయచ్చిత్త కర్మలు,సాత్విక కర్మలు ఎన్ని చేసినప్పటికీ, ప్రారబ్ధకర్మ**

**అనుభవించక తప్పదనే సందర్భాలుంటాయా?**

**జవాబు :** తప్పకుండా ఉంటాయి. మీరే చెప్పండి. హత్యలు, మాన భంగాలు చేసిన వారు ఎన్ని పూజలు చేసినా ఏ విధంగా తప్పించుకుంటారు? వాహన ప్రమాదాలు, హత్యలు, తీవ్ర వ్యాధుల ద్వారా అకాల మరణాలు ప్రబల ప్రారబ్ధ పాప ఫలాలుగా మనం గుర్తించవచ్చును.

ఆలస్య వివాహాలు, విడాకులు, పునర్వివాహాలు, వ్యాపార నష్టాలు, కోర్టు కేసులు, సంతానం లేకపోవటం, అనారోగ్యం, వృత్తిలో ఎదురు దెబ్బలు, మానసిక అనిశ్చితి, దిగులు, ఒంటరితనం– ఇవన్నీ కూడా పాప ఫలాలు ఐనప్పటికీ, వీటన్నిటికీ పరిహారాలున్నాయి. శాస్త్రంలో చెప్పబడిన శాంతి పూజలు చేసి, అనేక సత్కర్మలను త్రికరణశుద్ధిగా ఆచరించి కష్టాలనుండి విముక్తి చెంది మరలా జీవితాన్ని పునరుద్ధరించు కోవచ్చును.

తల్లి దండ్రులు చేసిన అప్పులను మనం తీర్చినట్లుగా కొన్ని సార్లు మన పూర్వికులు చేసిన దోషాల వలన కూడా మనకు కొన్ని పాపాలు చుట్టుకుంటాయి. సాత్విక పుణ్య కర్మలు నిరంతరం చేయటం వలన మనం ఈ దోషాలన్నింటినుండి బయటపడవచ్చును.

**ప్రశ్న : మనిషి జీవితం "కర్మ" లను బట్టి ఉంటుందా? జాతకంలోని గ్రహ స్థితి గతులను బట్టి ఉంటుందా?**

**జవాబు :** ఎవరి జీవితం వారు చేసిన పనులను బట్టి ఉంటుంది. నిన్న చేసిన పనులకు ఈ రోజు ఫలితాలు అనుభవిస్తున్నాము. ఈ రోజు చేసిన పనుల ఫలితాలు రేపు అనుభవిస్తాము. వివిధ కర్మలకు సంబంధించిన ఫలితాలు అనుభవంలోకి రావలసిన వేగంలో వ్యత్యాసాలుంటాయి గాని "భూత, వర్తమాన, భవిష్యత్తు" క్రమం మాత్రం తప్పదు.





మనిషి జీవితం "కర్మ" లను బట్టి ఉంటుందనేగా ఈ కర్మ సిద్ధాంతం పరిచయం చేస్తున్నది. కర్మ సిద్ధాంతం అందరికీ తెలిసి ఉంటే పిల్లల పెంపకంలో కూడా "కర్మ జ్ఞానం" మిళితమవుతుందని, తద్వారా భావి భారత సంతతి పది కాలాలపాటు పచ్చగా కళ కళలాడాలనే నా ఆకాంక్షను ప్రారంభంలోనే చెప్పాను.

ఇక గ్రహ స్థితిగతుల విషయంలో చాలా మంది ఇప్పటికీ అపోహపడుతుంటారు. గ్రహ స్థితిగతులను బట్టి జీవితం ఉండదు. జీవితం ఎలా ఉందని తెలుసుకోవటానికి జాతక చక్రంలోని గ్రహ స్థితిగతులు తోడ్పడతాయి. అంటే రక్త పరీక్ష చేయించుకున్నాక, మన రిపోర్టును బట్టి శరీరంలో రోగాలను వైద్యుడు ఏ విధంగా నిర్ధారించగలు గుతున్నాడో, ఇదే విధంగా "ల్యాబ్ రిపోర్టు" లాంటి జాతక చక్రంలోని సూర్యాది నవ గ్రహ స్థితిగతులను బట్టి భవిష్యత్తులో ఈ విధంగా ఉండటానికి అవకాశం ఉందని జ్యోతిష్కులు చెబుతారు.

***రక్తంలో చక్కెర శాతం ఎక్కువుందని రిపోర్టు చూసి తెలుసుకున్నాక, ఏ విధంగా తగిన చర్యలు తీసుకుని "చక్కెర "శాతం తగ్గించుకుంటామో, అదే విధంగా ఒక మంచి చర్య తీసుకుని మనలను మనం బాగు చేసుకోవటానికి జాతక చక్రం అనే రిపోర్టు ఉపయోగపడుతుంది.***

**ప్రశ్న : మనిషి గుణగణాలు, అహంకారం కూడా ప్రారబ్ధ కర్మను బట్టి ఉంటాయా? పుట్టుకతో వచ్చిన బుద్ధులు మారే అవకాశం ఉందా?**

**జవాబు :** ప్రధానంగా అర్థం చేసుకోవలసింది మనందరం మనషులం. పషు పక్ష్యాదులకు, వృక్ష జాతులకు లేని "బుద్ధి" మనుష్యులమైన మనకు ఉంది. అందుకే మనకు ఇన్ని ఆలోచనలు, భవిష్యత్తుకు సంబంధించి ప్రణాళికలు, ఆశలు, లక్ష్యాలు, కోరికలు. అందరిలో ఉన్న చైతన్యం ఒక్కటే. ఈ భూమి మీద పుట్టిన ప్రతి మనిషి యొక్క జీవితంలో ఆయా వ్యక్తుల యొక్క జీవన పోరాటం, సాధించిన

విజయాలు, మానసికమైన తృప్తి ముప్పేట గొలుసులాగా పెనవేసుకునే ఉంటాయి. ఎవరి స్థాయికి తగినట్లుగా వారి పోరాటం, విజయం ఉంటాయి. కానీ తృప్తి మాత్రం ఎవరికైనా ఒకే సాంద్రతలో ఉంటుంది. సృష్టిలో అన్నీ ద్వందాలు కావున "అసంతృప్తి" కూడా ఉండవచ్చును. అది వేరే సంగతి. కానీ అందరి జీవితాలలో "తృప్తి" కి సంబంధించిన అనుభూతులు ఉన్నాయి. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి, జిల్లా కలెక్టరు అయిన వ్యక్తి ఏ విధంగా తృప్తిగా ఉంటున్నారో, అదే విధంగా పాతిక బస్తాలు పండించిన రైతు, వివిధ వృత్తులలో విజయాలు చవిచూసిన వారంతా అదే రకమైన తృప్తిని అనుభవిస్తారు. యాచకుడు కూడా పండుగలు పర్వ దినాలలో తనకు లభించిన పలు రకాలైన పిండి వంటలు తిని ఎంతో "తృప్తి" ని అనుభవించగలుగుతాడు. అసలు ఏ సంతోషమూ తృప్తి లేకుండా ఎవరైనా ఎందుకు జీవిస్తారు? అందుకే గదా ఆర్థిక స్థితిగతులలో తేడా ఉన్నప్పటికీ "అహంకారం" మాత్రం తక్కువ ఉండదు. అయితే నేను సాధించాను అనే అహంకారం – నీ వరకే పరిమితమైతే, నేను మాత్రమే సాధించాను అనే అహంకారం – నీ పరిసరాలలో ఉన్న వారికీ, నీకూ హాని చేస్తుంది.

మనది పాంచ భౌతిక శరీరమని, త్రిగుణాత్మకమైనదని, ఈ స్థూల శరీరం ఆధారంగా వ్యవహారాలు నడపటానికి 19 పరికరాలు ఉన్నాయని మనం చెప్పుకున్నాం గదా! సత్వ, రజో, తమో గుణాలు మూడింటినీ త్రిగుణాలంటారు. సత్వగుణం వలన జ్ఞానం, వివేకం, రజో గుణం వలన క్రియాశీలత, తమో గుణం వలన బద్ధకం, సోమరితనం ఏర్పడతాయి. అదే విధంగా మనలో అనుక్షణం వివిధ రకాల భావోద్వేగాలు కలగటానికి పంచభూతాలు కారణమవుతాయి. అంటే ప్రకృతి ఎప్పుడూ ఒక్కలా ఉండదు కదా! విపరీతమైన ఎండ, భోరున వర్షం, శరీరం తట్టుకోలేని చలి, విపరీతమైన గాలులు, మరలా ఈ గాలులలో వడగాలి, చల్లగాలి, ఈదురుగాలి, పైరగాలి లాంటి పలు వ్యత్యాసాలు. కొన్ని సార్లు గాలాడక





ఉక్కపోత. ఇదే విధంగా మనిషి మనస్సులో కూడా అనేకం వచ్చిపోతుంటాయి.

అగ్ని, భూమి, వాయువు, జల, ఆకాశ తత్వాలు; సత్వ, రజో, తమో గుణాలు అందరిలోనూ ఉంటాయి. ఎందుకంటే మనందరి శరీరాలలో ఒకే విధమైన ముడి పదార్థం ఉంది. కాకపోతే ఈ పంచ తత్వాలలో ఏదో ఒక తత్వం లేదా రెండు తత్వాలు అధికంగా ఉండవచ్చును. అదే విధంగా సత్వ, రజో, తమో గుణాలలో ఒకటి ఎక్కువగాను మిగిలిన రెండు తక్కువ గాను ఉండవచ్చును. అంటే నిష్పత్తులలో తేడాలు. ఏ మనిషీ ఎల్ల కాలం ఒక్కలాగే ఉండడు. కాలం గడిచే కొద్దీ మనిషిలో పరిణితి పెరుగుతుంది. ఉచ్ఛనీచాలు తెలుసుకోగల్గుతాడు.

ఈ కారణంగా పుట్టుకతో తామస గుణ వ్యక్తి కూడా తర్వాత రజోగుణ వ్యక్తిగా, ఆ పిమ్మట సత్వ గుణ వ్యక్తిగా రూపాంతరం చెందవచ్చును. గోడలకు వేసే రంగుల మిశ్రమాలు మనం చూస్తున్నాము కదా! బాగా ముదురు రంగు అనిపిస్తే అందులో తెల్ల రంగు మిశ్రమం వేసి, మనకు కావలసిన విధంగా కంటికి ఆహ్లాదకరంగా కనిపించే స్థాయికి మనం రంగును మార్చగలుగుచున్నాం కదా! ఇదీ అంతే!

రామాయణం రాసిన వాల్మీకి పూర్వాశ్రమంలో బోయవాడు. ఇది పాత కాలం నాటి ఉదాహరణ అనుకుంటే ఇప్పటి వరకు మీ జీవితంలో తారసపడిన వ్యక్తులను గుర్తు తెచ్చుకోండి . ఎవరి దాకా ఎందుకు? మీ స్వంత అనుభవం పరిశీలించుకున్నా, పరిణామము అభివృద్ధి కనిపిస్తూనే ఉన్నాయి గదా! మీరు మీ కుటుంబాన్ని పోషించటానికి, మీ పిల్లలను అభివృద్ధిలోకి తీసుకురావటానికీ, ఎన్ని అగచాట్లు పడి ఉంటారు. మీ మాట తీరును, మీ వ్యవహార దక్షతనూ, మీ తెలివి తేటలనూ, సమర్థతనూ ఎంతో మంది మెచ్చుకుని ఉంటారు గదా! మీ

వృత్తి జీవితంలో ఎన్ని విజయాలు సాధించారు? పేపర్లో, టీ.వి.లో కనిపించక పోయినా, మీరు జీవించిన మనుష్యుల మధ్య ఆ సంఘంలో మీ ఉనికిని మీరు ప్రత్యేకంగా కాపాడుకుంటూనే ఉన్నారుగా! అహంకారం అంటే ఇదే. తన గురించి చెప్పుకునేది అహంకారం. పందొమ్మిది పరికరాలలోని నాలుగు అంతఃకరణాలలో అహంకారం కూడా ఉంది. అంటే మన తయారీలోనే ఈ ఏర్పాటు అంతర్గతంగా ఉంది. ***అయితే శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల లా అహంకారం కూడా సమ తుల్యంగా ఉంటేనే ఆరోగ్యం. తక్కువైతే చులకన. ఎక్కువైతే ఏవగింపు.***

వేదం కూడా మనిషి గుణ శూద్రుని స్థాయి నుండి గుణ బ్రాహ్మణుడి స్థాయికి ఎదిగేందుకు ప్రోత్సహిస్తుంది. తన ఆత్మ రక్షణకు, కుటుంబ పోషణార్థం శూద్రులను వెనుకబాటు తనంలో ఉన్నంతకాలం స్వార్థంగా ఉండమని శాస్త్రం చెబుతోంది. కాబట్టి ఆటో నడిపే వారు, అంట్లు తోమే పని మనుషులు, వివిధ రకాల చేతి వృత్తుల వారు, స్వల్పాదాయ వర్గాల వారు వారి సేవలకు ఎక్కువ ప్రతి ఫలం ఆశించటంలో తప్పులేదు.

మంచి గుణాలు సంతరించుకుని అహంకారం తొలగించుకోవటం సాధన అభ్యాసాలతో సాధ్యమవుతుంది. ***వినయమే ఏ కాలం లో నైనా, ఏ వ్యవస్థలో నైనా, ఏ దేశంలో నైనా విలువ కలిగిన స్వర్ణాధిక ఆభరణం.***

**ప్రశ్న : ప్రారబ్ధ కర్మ మీరు అనుభవించారా? కర్మ సిద్ధాంతం వలన మీరు ఏదైనా ప్రయోజనం పొందారా? మీ జీవితానికి సంబంధించిన యదార్ధ సంఘటనలు తెలియజేయండి?**

**జవాబు :** ఒక సిద్ధాంతం చెప్పేటప్పుడు స్వీయ పరీక్ష చేయకుండా అనుభూతి చెందకుండా ఋజువులు లేకుండా ఎలా చెబుతాను? పరిశోధనా దృక్పథంతో





తార్కికంగా జ్యోతిషం అధ్యయనం చేసాను. కర్మ సిద్ధాంతం తో మేళవించి రెండింటినీ సమన్వయం చేసుకుని వాస్తవ పరిస్థితులతో సరిపోల్చుకుని తర్వాత కాలంలో నాడీ జ్యోతిషంలో సూచింపబడిన శాంతి పూజలు నిర్వహించాను. వృత్తిలో అనేక వైఫల్యాలు, విరామం, ఆటంకాలు చవి చూసిన నేను వాటన్నింటినీ తట్టుకుని అధిగమించి నిలబడ్డాను. క్రింద పడిన ప్రతిసారి పైకి లేస్తూ విజయ వైఫల్యాలను సమాంతరంగా అనుభవించాను. ***ఈ అనుభవ సారాంశం ఏమంటే అసలు వైఫల్యం అనేది లేదని, విజయానికి ఉన్న మరో పర్యాయపదమని అర్థం చేసుకున్నాను.*** అతి సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నేను విద్య, ఉద్యోగం, వ్యాపారాలలో అనేక ఎత్తు పల్లాలు చూసాను. వంద రూపాయలకు కూడా తడుముకున్న "మజిలీ" నుండి కోటి రూపాయలు దుబారా చేసే "మజిలీ" వరకూ పయనించాను.

ఇదంతా నా సమర్థత అని నేను అనుకోవటం లేదు. సత్కర్మలను ఆచరించటం వలన నాకు "విశ్వం" ప్రసాదించిన సద్యోస్ఫురణ యొక్క ఫలితంగా భావిస్తున్నాను. తెలివి, సమర్థత, ప్రతిభ సృజనాత్మకత, సమయస్ఫూర్తి, లౌఖ్యం–అని ఎన్ని పేర్లు చెప్పినప్పటికీ అవన్నీ కాలం కలిసి రాక పోతే చేయగల్గిందేమీ లేదు. మానవ ప్రయత్నం లోపం లేకుండా, నిర్విరామంగా మనం పనిచేయగలం. ఇది మాత్రమే మన చేతుల్లో ఉంది. ఫలితం మన చేతుల్లో ఉండదు కదా! నేను ఎంతో కష్టపడి చేసిన ప్రయత్నాలకు నేను పెట్టిన పెట్టుబడి కూడా రాని ఉదంతాలు కోకొల్లలు. అసలు నేను ఏమీ ప్రయత్నం చేయకుండా చాలా విచిత్రంగా నాకు లక్షలు వచ్చిపడ్డ ఉదంతాలు కూడా అనేకం ఉన్నాయి. ఈ ఒక్క విషయం ఎందుకు చెబుతున్నానంటే కొన్ని సార్లు ఫలితం ఆలస్యంగాను, మరో రూపంలో రావచ్చును. మరి కొన్ని సార్లు నగదు రూపంలో గాక, జన సహకారం, సేవ తదితర రూపాలలో కూడా మనకు లభిస్తుంది.

పంట పండక పోయినా, గొడ్లకు వరి చెత్త ఉపయోగపడినట్లు ఒక్కోసారి అలాగవుతుంది. అయినప్పటికీ సర్వకాల సర్వ అవస్తలయందు నిరంతర నిర్విరామ కృషి – మానవులకు అనుసరణీయ మార్గం.

ఫలితం బహు రూపాలలో ఉంటుంది. కొన్ని సార్లు రానట్లు కనిపించినా అధైర్యం చెందక ముందుకెళ్లాల్సిందే. విశ్వ సూత్రాలకనుగుణంగా వేదంలో పంచ మహా యజ్ఞాలు సూచింపబడ్డాయి. పూర్తి వివరాలు ఇక్కడ ఇవ్వటం లేదు. దైవ పూజ, సత్యం, ధర్మం, క్షమ, వివేకం, ఓర్పు, పరోపకారం మొదలైన లక్షణాలే జీవితంలో మీరు కోరుకున్న ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విజయ మార్గాలు.

ప్రారబ్ధకర్మ నేను అనుభవించటం కాదు. మనందరం అనుభవిస్తూనే ఉంటాము. మరణంతోనే అది పూర్తవుతుంది. నా వ్యక్తిగత జీవిత సంఘటనల గురించి చెబితే స్వోత్కర్ష గా ఉంటుందని ఇక్కడ చెప్పటం లేదు. నేను ఆచరించని నీతి సూత్రాలు నేను ఎవరికీ చెప్పను. కర్మ సిద్ధాంతం వలన నేను ఎంతో ప్రయోజనం పొందాను కాబట్టి మీకు చెబుతున్నాను. పైగా ఇది ఆచరించటానికి వీలైనది, సులభమైనది కూడా!

**ప్రశ్న : త్రికరణశుద్ధిగా అంటూ ఉంటారు. అంటే ఏమిటి?**

**జవాబు :** మనోవాక్కాయ కర్మలు. అంటే మనసులో అనుకున్నది, నోటితో మాట్లాడేది, చేసే పని–ఈ మూడు ఒకటే అయితే త్రికరణశుద్ధి అంటారు. చెప్పేదొకటి, లోపల మరొకటి, చేసేది మరొకటి ఉండకూడదని శాస్త్రం చెబుతుంది. అబద్ధం చెప్పటం మహా పాపం. సత్యమునే చెప్పాలని, ఇప్పుడు లౌకిక జీవితంలో సత్యం చెప్పేవారికి తర్వాత కాలంలో అసలు "సత్యం" గురించి జ్ఞానం కలుగుతుందని వేదాంతంలో చెప్పబడింది.





**ప్రశ్న : అహంకారం వలన జరిగే నష్టం అర్థం అయ్యేందుకు ఏదైనా ఉదంతం గురించి వివరించండి?**

**జవాబు :** పెద్ద నిర్మాత ఒకాయన సినిమా తీస్తున్నాడు. దర్శకుడు స్వతంత్ర భావాలు గల ప్రతిభావంతుడు. చిత్రీంకరించిన ఫిల్మ్‌ను ఎప్పటికప్పుడు సన్నివేశం బాగా వచ్చిందా లేదా అని చూసుకోవటం ఆ నిర్మాతకు అలవాటు. హీరో జమిందారు. హీరోయిన్ పేద పిల్ల. వీళ్లిద్దరూ ప్రేమించుకుంటారు. పాట పూర్తయ్యేసరికి జమీందారి తండ్రి చూస్తాడు. ఆ తర్వాత హీరోయిన్ ఇంటికి వెళ్లి "చిన బాబును మరచిపో, మా పరువును కాపాడు" అంటాడు. ఏడుపులు పెడ బొబ్బలు పూర్తయ్యాక, హీరోయిన్ ఈ సంగతి ఎవ్వరికీ చెప్పనని పెద్ద జమిందారుకు మాట ఇస్తుంది. కాని అప్పటికే ఆమె గర్భవతి. దీనికి కారకుడైన వాడి పేరు చెప్పమని ఆమె తండ్రి ఎంత నిలదీసినా పెద్ద జమిందారుకిచ్చిన మాట కారణంగా ఆమె పెదవి విప్పదు. గత్యంతరం లేక పుట్టిన పిల్లవాడిని అనాథ శరణాలయంలో జేర్పించిన ఆమె తండ్రి, ఈ విషయం ఆమెకు చెప్పకుండా పిల్లవాడు పురిట్లోనే పోయాడని చెబుతాడు.

పుట్టుకతోనే తల్లి దండ్రులు దూరమైన పిల్లవాడు అనాధ శరణాలయంలో పెరుగుతాడు. హీరో హీరోయిన్లు వాడి తల్లి దండ్రలు. అనాధ శరణాలయంలో పిల్లందరూ కలసి రోజూ ప్రార్ధన చేస్తారు. ఈ పిల్లవాడు మా అందరినీ చల్లగా చూడు దిక్కులేని వాళ్లం అని దేవుడిని ఉద్దేశిస్తూ ఒక పాట పాడే సన్నివేశం ఆరోజు దర్శకుడు చిత్రీకరించాడు. తన స్టూడియోలో ఈ సన్నివేశం చూసుకున్న నిర్మాతకు అసంతృప్తి కలిగింది. ఆ పాట పాడుతున్న సమయంలో ఆ పిల్లవాడి కంట్లో నీటి చుక్కలేదు. వాడు ఏడుస్తూ పాట పాడితే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డాడు. మర్నాడు దర్శకుడిని పిలిచి తన పాయింటును వివరించాడు. ఆ పాటను తన ఆలోచన ప్రకారం రీ షూట్ చేయమన్నాడు. నిర్మాత అభిప్రాయంతో

దర్శకుడు అంగీకరించలేదు. "పిల్లవాడు ఏడవకూడదండీ! పిల్లవాడిని చూసి ప్రేక్షకులు ఏడవాలి. అందువలన నేను తీసింది కరక్టే" అని సమర్థించుకున్నాడు. "పిల్లవాడికి లేని ఏడుపు ప్రేక్షకులకు ఎందుకుంటుందయ్యా?...."వాడు ఏడిస్తే ఆ ఏడుపును చూసి అయ్యోపాపం అని ప్రేక్షకులు ఏడుస్తారు. అందువలన రీ షూట్ చేయండి. అని నిర్మాత గట్టిగా చెప్పాడు. దర్శకుడు వినకుండా వాదన పెంచాడు. నిర్మాతకు విసుగొచ్చింది. "చూడు డైరెక్టరూ! రీ షూట్ చేస్తే అదనంగా డబ్బు ఖర్చేగదా! అంటే నేను నష్టపోతున్నాను. రేపు సినిమా ఆడక పోయినా నాకే నష్టం గదా! మధ్యలో నీకేమిటి నష్టం! నేను చెప్పినట్లు చేయి" అన్నాడు చిరాగ్గా....

"ఈ సీను మళ్లీ తీసేటట్లయితే మీరు మరొక డైరెక్టరును చూసుకోవలసి ఉంటుంది". వెనకా ముందు ఆలోచించకుండా టక్కున అనేశాడు దర్శకుడు. నిర్మాత ముఖం పాలిపోయింది. దర్శకుని ప్రవర్తన వలన నొచ్చుకున్న ఆయన వెంటనే తేరుకుని "అయితే ఆ విషయం పేపరు మీద రాసివ్వండి" అని లాక్ చేసాడు. దర్శకుడు రోషపడి పేపరు మీద తాను ఆ సినిమా నుండి ఉద్దేశపూర్వకంగా తప్పుకొంటునట్టు రాసిచ్చి విసురుగా బయటకు వచ్చేసాడు. ఇది కథ కాదు. ఒక సినీరచయిత చెప్పిన ఉదంతం. యధాతథంగా మీకు తెలియజేసాను.

ప్రియమైన పాఠకులారా! దర్శకుడు తొందరపడ్డాడని మీకు స్పష్టంగా అర్ధమవుతుంది గదా! అతని అహం అతని చేత తప్పు చేయించింది. ఏదైనా ఇలాంటి సంఘటనలు చూసిన తర్వాత లేదా విన్న తరువాత మనకు మంచి చెడులు బాగా అర్ధమవుతాయి. ఇప్పుడు జరగబోయేది మీరు ఊహించవచ్చును. ఒక ప్రధాన సంఘటనకు వెన్నంటే అనుబంధ సంఘటనలు జరగకుండా ఉంటాయా? పైకి విసిరిన బంతి నేలను తాకవలసిందే గదా! ఆ రోజు ఇంట్లో





నుండి బయలుదేరేటప్పుడు కూడా ఆ దర్శకుడు, తాను ఆ సినిమా నుండి విరమించుకోవలసి వస్తుందని యోచించి ఉండడు. ఈ సినిమా పూర్తయ్యాక తనకు లభించే పెద్దమొత్తం పారితోషికంతో తాను చేయాలనుకున్న పలు కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు ఆగి పోయినట్లేగా! ఇలాంటి పరిస్థితులలో సహజంగానే వెంటనే సినిమా దొరకదు. సినిమా పూర్తి చేసిన వానికి లేదా సినిమా తీస్తున్న దర్శకునికి టాలెంటును బట్టి ఇతర సినిమా అవకాశాలు రావటం పెద్ద కష్టం కాదు గానీ, ఒక పెద్ద నిర్మాత సినిమాను మధ్యలో వదిలేసి వచ్చిన దర్శకుడిని ఎవరు పెట్టుకుంటారు? కారణాలు ఏమైనా ఉండనివ్వండి, దీన్ని దర్శకుని వైఫల్యంగానే మిగిలిన వారంతా భావిస్తారు గదా! ఆ సంఘటన పాతబడి కాల గర్భంలో కలిసాక ఏమైనా అవకాశాలు వస్తాయేమోగాని, వెంటనే మాత్రం కెరీర్‌కు ఎంతోకొంత గండిపడినట్లే! ఆర్థిక పరమైన ఒడి దుడుకులతో మానసిక క్షోభ. ఈ లోగా నవతరం దర్శకులు పరిశ్రమలోకి దూసుకు వస్తారు. వారి సమకాలికులే నిర్మాతలుగా ఉంటారు గావున, పాత దర్శకుల పూర్వ వైభవాలతో సహజంగానే వారికి అంతగా అవసరం ఉండదు. ఫలితంగా పూర్తిగా కెరీర్ సాఫల్యం గాకుండానే తెరమరుగవ్వాల్సి ఉంటుంది. సరిగ్గా ఇలాగే జరగకున్నా తాము గొప్ప అనుకునే అహంకారంతో గూడిన అంతరంగం వలన అభివృద్ధి కుంటుపడుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ఇప్పుడు ఇదే సంఘటనలో దర్శకుడు వివేకవంతుడైతే అతని ప్రతి చర్య ఏ విధంగా ఉంటుందో విశ్లేషించుకుందాం.

నిర్మాతయొక్క ప్రతి పాదన చిరునవ్వుతో వింటాడు దర్శకుడు. అంత డబ్బు పోసి సినిమా తీస్తున్న నిర్మాత అభిప్రాయం వెనుక సినిమా విజయవంతం కావాలనే తపన, సన్నివేశాలు ప్రేక్షకుడిని రంజింపజేయకుంటే , అసలు మూలధనం రాబట్టుకోవడం కూడా కష్టమనే అనుభవంతో ఆ నిర్మాత సన్నివేశాలు లొసుగులు

లేకుండా ఉండాలని తాపత్రయపడుతున్నాడని దర్శకుడు సానుకూల దృక్పథంతో స్పందిస్తాడు. ఈ సంఘటన సవ్యంగా అర్థం చేసుకుంటాడు. పైగా రీ షూట్ చేయటం వలన నిర్మాతకు అదనపు ఖర్చు, తనకేమి నష్టం లేదు కదా అనే వాస్తవం గమనిస్తాడు. డబ్బు ఖర్చు పెట్టి సినిమా తీస్తున్న నిర్మాత అభిరుచిని, అభిప్రాయాలను గౌరవించటం తన ధర్మమని దర్శకుడు భావిస్తాడు. ఒకవేళ తాను చిత్రీకరించిన సన్నివేశం చాలా బాగుందని, ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని దర్శకునికి నమ్మకంగా అన్పించిన యెడల, అప్పుడు కూడా నిర్మాత కోరికను దర్శకుడు వ్యతిరేకించడు. అప్పుడు దర్శకుడు ఈ విధంగా అంటాడు “సర్ నేను తీసిన సన్నివేశం మీద నమ్మకం ఉంది. ఆ పిల్లవాడికి తాను జమిందారి బిడ్డనని, తల్లి దండ్రులు బతికి ఉన్నారని తెలియదు. కాబట్టి వాడికి ఏడుపురాదు. వాడి కథ ప్రేక్షకులకి తెలుసు కాబట్టి అయ్యో ఈ పిల్లవాడికి ఏం కష్టం వచ్చింది అని సానుభూతితో ఏడుస్తారు. అయినా మీరు చెప్పినట్లుగా రీ షూట్ చేస్తాను. తర్వాత రెండు వెర్షన్లు చూద్దాం. మీరు ఏది ఉంచమంటే అది ఉంచుతాను” అని దర్శకుడు తన పాయంట్ ఆఫ్ వ్యూ ను ప్రతిఫలిస్తూ నిర్మాత కోరికను అంగీకరిస్తాడు.

ప్రతిభ ఎంత ఉన్నప్పటికీ, అది వినయం వివేకంతో ప్రాసెస్ చేయబడకపోతే, ఆ వ్యక్తి ఎదుగుదలకు అనేక అవాంతరాలు ఇలాగే ఎదురవుతుంటాయి. జీవితంలో మార్చలేని వాటిని సానుకూల వైఖరితో అంగీకరించమని, మార్చగలిగిన వాటిని ధైర్యంతో మార్చమని, ఏవి మార్చగలమో, ఏవి మార్చలేమో తెలుసుకోవటం వివేకమని వేదాంత పరిచయంలో జ్ఞానయోగం గురించి స్వామి పరమార్థానంద భాష్యం చెప్పారు.

* * * * *





పాఠకులకు ఇక్కడ ఒక సందేహం తప్పకుండా రావాలి. మనకున్న ఇంగిత జ్ఞానం అంతటి ప్రతిభావంతుడైన ఆ దర్శకుడికి ఎందుకుండదు? తప్పకుండా ఉంటుంది. కాని అహం ఒక పట్టాన ఇంగిత జ్ఞానాన్ని ఆమోదించదు. అహంకారం ఎల్లప్పుడూ తన నిర్ణయమే సరైనదంటుంది. తమాషా ఏమంటే అది అప్పటికప్పుడు నిర్మాణాత్మకమైన ఒక గొప్ప తర్కాన్ని తయారు చేసి మనసుని మభ్యపెడుతుంది. తర్కం ఏమంత గొప్పది కాదనే సత్యం అహంకారానికి తెలియదు. అందుకే ఎదుటి వ్యక్తులను కించపరుస్తుంది.

దీనికంతటికీ మూల కారణం ప్రారబ్ధ కర్మ. దీనికి అనుగుణంగా బుద్ధి మారిపోతుంది. కర్మ సిద్ధాంతం గురించిన అవగాహన ఉన్న వ్యక్తి ఎల్లప్పుడూ సమదృష్టి కలిగి ఉంటాడు గావున ఇలాంటి సంఘటనలు ఆకస్మికంగా ఎదురైనప్పుడు వివేకంతో స్పందిస్తాడు.

మనందరి జీవితాలలో మనం కూడా అహం వలన డబ్బు, ఉద్యోగం, బాంధవ్యం, స్నేహం, ప్రేమ, అధికారం, వ్యవహారం ఏదో ఒకటి నష్టపోయి ఉంటాము. ఎందుకంటే మన జన్మకు మూల కారణం ప్రారబ్ధకర్మ.

మనకు అహంకారంమీద చాలా మక్కువ. అందుకే మనం అందరికంటే ఎక్కువ. వ్యవహారికంగా ఈ వాఖ్యం బాహాటంగా మనం చెప్పకపోయినా, అంతరాంతరాలలో మనం అనుభూతి చెందుతున్న విషయం ఇదే. రోగ నిర్ణయం (డయగ్నోసిస్) చేయనంతకాలం, రోగానికి మందులు ఎలా నిర్ధారించలేమో, అహం అన్ని దౌర్భల్యాలకు మూలం అని ఎంత తొందరగా రొగ నిర్ధారణ చేసుకుంటే అంత తొందరగా రోగవిముక్తిగావచ్చును.

***కర్మజ్ఞానం అహంకారాన్ని తొలగించి, సంఘటనలను నిర్వికారంగా వీక్షించే సమ దృష్టిని ఇవ్వగలుగుతుంది.***

**ప్రశ్న : పెదవి దాటితే పృధ్వీ దాటుతుందంటారు. దీనికి కూడా కర్మ ఫలం ఉంటుందా?**

**జవాబు :** ఈ మాటలు నేను తొలిసారిగా 40 సంవత్సరాల క్రితం విన్నాను. నేను అక్కడ లేని వేరొక వ్యక్తి గురించి ఎగతాళిగా మాట్లాడటం విన్న చంద్రమౌళి తాతయ్య నన్ను మందలిస్తూ ఈ మాట అన్నాడు. మనం ఎవరి గురించైనా చులకనగా మాట్లాడితే వారికి ఈ మాటలు చేరతాయి అనే అర్ధంలో ఆయన ఈ మాటలు చెప్పినప్పటికీ, ఈ వాఖ్యంలో మన పూర్వీకులు పొందు పరచిన విశ్వ రహస్యం ఉంది.

వేదాలు అందరికీ అర్ధం గావు. అందువలన వాటిని విడమరచి చెప్పటానికి అనేక గ్రంధాలు కావలసి వచ్చాయి. ఈ గ్రంధాలు కూడా చాలా మందికి అర్ధం గావు. అందువలన పండితులకే గాక పామరులకు సైతం అర్ధం అయ్యేందుకు చిన్న చిన్న వ్యాఖ్యాలతో ఋషులు అనేక సూత్రాలు రచించారు. వేదాలను దేవుడు ఇస్తే వాటి నుండి కీలకమైన ధర్మాలను, నియమాలను ఏరి ఒక మాలగా ఋషులు కూర్చారు. అంటే ఆనాడు ఋషులు, ఈనాడు జ్ఞాన గురువులు, ప్రసంగాలు ప్రవచనాలు చెప్పే మఠాధి పతులు, ఉపన్యాసకులు, అప్పుడప్పుడు ప్రాధమిక వాచకాలు రాసే నాలాంటి రచయితలు చెప్పే విషయాలకు చెందిన మూల భావం వేదం లోనిదే! ఆ భావ వ్యక్తీకరణకు ఉపయోగించే భాషా, అలంకారాలు, ఉదాహరణలు మాత్రం మావి.

మనము మాట్లాడే మాటలు మన చేతలు "విశ్వం" లో చోటు చేసుకుంటాయి. అంటే పెదవి దాటిన మాట, చేసిన పని రెండూ వెనుక్కు తీసుకోలేము. పంచ కర్మేంద్రియాలలో వాక్కు కూడా ఉందని మీకు గుర్తుండే ఉంటుంది. ఆ విధంగా పెదవి దాటిన ప్రతి మాట "విశ్వం" లో కలసిపోయి





మన మాటలు చేతలు పరిణామాలకు కారణమవుతాయి. ఇదే చర్య-ప్రతి చర్య సూత్రం. ఆ విధంగా చూసినప్పుడు మనం ఎక్కడ ఏ మారుమూల మాట్లాడినా అది విశ్వంలో ప్రవేశించి కర్మఫలంగా మనకే తిరిగి వస్తుంది.

అందుకే అధిక ప్రసంగాలు చేసేవారు వాటి వలన అవస్థలు పడుతూనే ఉంటారు. "కర్మసిద్ధాంతం" ఏ ఒక్కరినీ ఉపేక్షించదు. మాటలు, చేతలకే గాదు మనం చేసే ప్రతి ఆలోచనా విశ్వంలో భాగమవుతుంది. మనకు ఏ రకమైన ఆలోచనలు వస్తున్నాయని మనం అనుక్షణం గమనించుకుంటూ అప్రమత్తంగా ఉండాలి. అలా జాగరూకలై ఉండటం వలన ఆలోచనలమీద అదుపు ఏర్పడుతుంది. పంచభూతాల తత్వాల వలన, త్రిగుణాల వలన మన ఆలోచనలు మారిపోవటం గమనించి నిరర్ధకమైన ఆలోచనల నుండి, ప్రతికూల ఆలోచనలనుండి మనస్సును మళ్లిస్తుండాలి.

పెదవి దాటే ప్రతి మాటకు విత్తనం "ఆలోచన" అని మరువకండి. అందుకే మనం ఆలోచనల గురించి మాట్లాడుకోవాలి. మాట్లాడకుండా ఉండలేని బలహీనులు మౌన వ్రతాన్ని ఆశ్రయించటం చాలా మంచిది. ఏదో ఒక మంత్రం జపించటమో, రాయటమో, యూ ట్యూబ్‌లో ప్రవచానాలు వినటమో అభ్యాసం చేసిన యెడల వాచాలత అదుపులో ఉంటుంది. అంతే కాదు, మన చేతలు ఆలోచనలు పరస్పరాశ్రయాలు. మంచి అలవాట్లు మంచి ఆలోచనలకు కారణమవుతాయి. మంచి ఆలోచనలు మంచి అలవాట్లకు కారణమవుతాయి. పృధ్వి అంటే భూమి. పృధ్వి దాటటమంటే భూ మండలం దాటి విశ్వంలో ప్రవేసించటం. పెదవి దాటితే పృధ్వి దాటటం-అనేది కర్మసిద్ధాంత సూత్రం.

* * * * *

# నా జ్ఞాపకాలు – మీకు ప్రోత్సాహం

అప్పటికి నాకు 20 ఏళ్లు ఉంటాయేమో? మా అమ్మమ్మ గారి ఊళ్లో నిరుద్యోగంతో ఖాళీగా ఉంటున్నాను. ఆ రోజు నిరాశ, నిస్పృహలతో నేను కోదండపాణి గారి ఇంటివద్ద వంతెన మీద కూర్చుని ఉన్నాను. గేదెలను తోలుకుంటూ వెళ్తున్న ఒక రైతు, ఊళ్లో అతనే నన్ను చూసాడు. దురదృష్టమేమంటే ఆయన పేరు నాకు ఇప్పుడు గుర్తులేదు. ఆయన నా దగ్గరకు వచ్చి నా పక్కన కూర్చుని నిర్లిప్తంగా ఉన్న నా ముఖంలోకి చూస్తూ అన్నాడు. "ఉద్యోగం రాలేదని దిగులుపడుతున్నావా? నీకు ఏమంత వయసయిందని బాధపడుతున్నావు? నీకు చాలా భవిష్యత్తు ఉంది. ఉద్యోగం ఈరోజు గాకుంటే రేపు వస్తుంది" అంటూ నాలుగు సానునయ వాఖ్యాలు చెప్పి వెళ్లిపోయాడు. క్షణాల్లో నా దిగులంతా చేత్తో తీసేసినట్లు మాయమైంది. నాకు కొండంతబలం వచ్చినట్లన్పించింది. నిరక్షరాస్యుడైతేనేమి? జ్ఞానం ఉన్న మనిషి. ఒక యువకుని ముఖంలో నిరుత్సాహం చూసి తన దారిన తాను పోకుండా తన అనుభవంతో నాలుగు మంచి మాటలు చెప్పాడు. మానవతా విలువలంటే ఇవే!

* * *

ఒకసారి బస్సు చార్జీలకు డబ్బుల్లేక పేరకలపూడి నుండి పెదకాకాని కాలి నడకన బయలుదేరాను. మిట్ట మధ్యాహ్నం. అప్పటికి 15 కి. మీ.లు నడిచాను. అలసటగా ఉండి ఖాజీపేట దాటాక రోడ్డు పక్కన చెట్టుకిందకు చేరాను. రోడ్డుకు ఆనుకుని ఉన్న చేలో గేదెలను మేపుకుంటూ, చెట్టుకింద కూర్చుని పర్యవేక్షిస్తున్న 15 ఏండ్ల కుర్రాడు నాకు పరిచయమయ్యాడు. అతని పేరు నారాయణ అని ఊరు పక్కనే ఉన్న ఖాజీపేట అని చెప్పాడు. ఎక్కడనుండి వస్తున్నావని అడిగాడు. చెప్పాను. నడచి వస్తున్నావెందుకు అనడిగాడు. డబ్బులు





లేవన్నాను. ఓహో... అన్నట్లు తల పంకించాడు. కొంచెంసేపు సేదతీరాక నేను బయలు దేరాను. ఫిబ్రవరి మాసంగావటాన ఎండ బాగానే ఉంది. "ఆగు వెళ్దువుగాని" అని నన్ను ఆపాడు నారాయణ. ఎందుకన్నాను. తన చేతిలో ఉన్న కందువా మూటను చూపిస్తూ "ఇందులో మినుములున్నాయి. కాసేపాగితే మినుములు కొనే వాళ్లు సైకిళ్లేసుకుని ఇటే వస్తారు. ఇవమ్మి నీకు డబ్బులిస్తాను, బస్సుమీద వెళుదువు గాని" అన్నాడు. "ఇంత ఎండలో నడవొద్దు" అని కూడా అదనంగా మరోమాట జత చేసాడు. నాకు నిరీక్షించే మానసిక పరిస్థితి లేనందున నారాయణ ఆఫర్ ఉపయోగించుకోకుండా బయలు దేరాను. కాని దారిన పోయే ఒక బాటసారి మీద అతను చూపిన మానవత, సాటి మనిషి పట్ల నారాయణ స్పందించిన తీరు మరవలేనిది.

* * *

మైల క్రిష్ణారావు అని ఒక నాటి నా మిత్రుడు. షుమారు ఒక సంవత్సరం పాటు మా మైత్రీ బంధం కొనసాగింది. అతను గేదెలను కాచుకుంటూ మోటారు పంపు షెడ్డు దగ్గరకు వచ్చేవాడు. నేను నిరుద్యోగినయినందు వలన ఇంట్లో నాలుగు మెతుకులు తిని, కాలక్షేపంగా ప్రశాంతంగా ఉంటుందని ఆ షెడ్డు దగ్గరకు చేరేవాడిని. మా దూరపు బంధువులదే ఆ షెడ్డు. క్రిష్ణారావుతో అక్కడే సావాసం. నన్ను బాగా ఎంకరేజ్ చేసేవాడు. పయనించే ఓ చిలుకా అని పాటపాడేవాడు. గొంతు శ్రావ్యంగా ఉండేది. షణ్ముక ఆంజనేయరాజు పద్యాలు కూడా పాడేవాడు. క్రిష్ణారావు పెద్దగా చదువుకోలేదు. కానీ మానసిక విశ్లేషణలో పై చేయి ఉన్నట్లుగా అప్పట్లోనే నాకు అన్పించేది. "నేను ఇప్పుడు చెబుతున్నాను చూడు నువ్వు బాగా పైకివస్తావు. బాగా సంపాదిస్తావు. ముందు ముందు రోజుల్లో ఈ ఊళ్లో నువ్వుండవు. మన సావాసం మాత్రం మరచి పోమాక"

అనేవాడు. చెప్పొచ్చేదేమంటే అక్షర జ్ఞానం లేని క్రిష్ణారావు సాటి మనిషిపట్ల చూపిన స్పందన, మానవతా పరిమళపు గుభాళింపు ఇంకా నా ముక్కుపుటాలకు సోకుతూనే ఉంది. క్రిష్ణారావు ఇప్పుడు లేదు.

* * *

అప్పుడు నేను అండర్ గ్రాద్యయేట్‌ను. పెళ్లికూడా అయింది. హైదరాబాదులో ఉద్యోగాలు ప్రయత్నిస్తుంటే మినిమమ్ గ్రాద్యుయేషన్ ఉండాలంటున్నారు. అలాంటి పరిస్థితులలో ఒక లిమిటెడ్ కంపెనీ నుండి ఇంటర్వ్యూ వచ్చింది. వాళ్లు కూడా గ్రాడ్యుయేట్స్ కావాలనే పేపర్లో ప్రకటన ఇచ్చారు. కానీ ప్రయత్నిస్తే వచ్చిన నష్టం ఏముందని దరఖాస్తు పంపాను. మూర్తి, సత్యన్నారాయణ అనే ఇద్దరు ఇంటర్వ్యూ చేస్తున్నారు. ''మూర్తిగారే మిమ్మల్ని కావాలని పిలిపించారు. ఈ పోస్టుకు గ్రాడ్యుయేట్స్ చాలా మంది ఎదురుచూస్తున్నారు'' అని సత్యనారాయణ చెప్పాడు.

నా దరఖాస్తులో హాబీస్ అనే కాలమ్ ఎదురుగా ''కథలు రాయటం'' అని రాసాను. అది చూసి ఆసక్తి చూపించారు మూర్తిగారు. దానిమీద నేను రాసిన కథల వివరాలడిగి తెలుసుకున్నారు. నాకు ఉద్యోగం ఇవ్వటానికి ఎవ్వరూ ఒప్పుకోలేదు. చివరకు వివాదం కంపెనీ చైర్మన్ వరకు వెళ్లింది. ఒక అభ్యర్థికోసం కంపెనీ పాలసీ ఎందుకు సడలించాలని అందరి వాదన. మొత్తం మీద నా కోసం మూర్తిగారు చివరకంటా పోరాడారు. ఆయనకు అవసరం లేక పోయినా నాకు ఉద్యోగం రావటానికి కారణమయ్యాడు. ఉద్యోగం ఇవ్వటమే గాక పని విషయంలో కూడా అదే సాత్వికతతో నన్ను ప్రోత్సహించి పని నేర్పించాడు. మూర్తిగారు ఇప్పుడెక్కడున్నారో, అసలు ఉన్నారో లేదో కూడా తెలియదు. కానీ ఆయన చూపిన మానవత, కరుణ నా స్మృతిపథంలో చెరిగిపోలేదు.

* * *





నా జీవితంలో వృత్తిలో ఆటంకాలనేవి నన్ను నీడలా వెన్నంటే ఉండేవి. బెటర్ ఫ్యూచర్ ఫర్ యూ అనే వెబ్‌సైటు ప్రారంభించి, నాకు తెలిసిన కంపెనీల నుండి ప్రకటనలు సేకరించుకొని ఆ వచ్చిన డబ్బుతో వ్యాపారం ప్రారంభించాలని నాకు ఆలోచన వచ్చింది. మొదటగా మిత్రుడు ఇబ్రహీం వద్దకు వెళ్లాను. తెల్ల కాగితం మీద పెన్సిల్‌తో గీతలు గీసి కాన్సెప్ట్ వివరించాను. ఇంకా ప్రారంభంకాని వెబ్‌సైట్‌లో ప్రకటన ఇవ్వడమే గాక, పైకం రూ.5000/- అప్పటికప్పుడే చెల్లించాడాయన. అప్పట్లో అది చాలా పెద్ద మొత్తం. నిజం చెప్పాలంటే ఆయన రియల్ ఎస్టేటు కంపెనీకి ఆ ప్రకటన ఏవిధంగానూ ఉపయోగ పడదని ఆయనకూ తెలుసు. అయినా ఇంకా ప్రారంభింపబడని వెబ్‌సైటుకు ప్రకటన ఇచ్చాడంటే మానవతా విలువలు కాక మరేమిటి? మీలో ఎవరికైనా ఒకటి అనిపించవచ్చు. నేను పెన్సిల్‌తో గీతలు గీసి కాన్సెప్ట్ చెప్పిన విధానానికి ఆకర్షితుడై ఉండవచ్చు. అది మన ప్రయత్నం, మన ధర్మం. ఏదో ఒక దారం ఉండాలిగా డబ్బు నడిచి రావాలంటే. అంత మాత్రాన నా సమర్థత అని నేను అనుకోవటం లేదు. అలా ఎవరైనా అనుకుంటే అది అజ్ఞానం. ***అయితే మనకు ఓ ప్రణాళిక, లక్ష్యం, నమ్మకం-వీటితో గూడిన ప్రయత్నం నిరంతరం ఉండాల్సిందే.***

ఇబ్రహీం లాగే ఎల్లమంద, వి.ఆర్. ప్రసాద్, అమర్, రమేష్ బాబు... ఇంకా చాలా మంది నాకు ప్రకటనల నిమిత్తం డబ్బు ఇచ్చారు. ఆ విధంగా ఒక కంపెనీ నేను ప్రారంభించకుండానే ఆదాయం రావటానికి, విజయవంతం గావటానికి వీరంతా తోడ్పడ్డారు.

* * *

ఉద్యోగం లేక నేను అవస్త పడుతుంటే యాడ్ ఏజెన్సీ మహదేవన్ గారు నాకోసం చాలా కంపెనీలలో నా గురించి చెప్పారు. మొత్తంమీద డాక్టర్ ప్రహ్లాదు గారిని

పరిచయం చేసాడాయన. ప్రహ్లాదు గారు ఆయన పని చేస్తున్న కంపెనీ యం.డి.కి నన్ను పరిచయం చేసారు. పెద్దగా ఇంటర్వ్యూ ఏమీ చేయలేదు. నా షర్టు బాగుందన్నాడాయన. మీ లాంటి మంచి డ్రెస్సింగ్ సెన్సు ఉన్న వాళ్లు మన కంపెనీకి కావాలన్నాడాయన. నాకు ఉద్యోగం దొరికింది. నా ఒంటి మీద ఉన్న గోల్డ్ కలర్ ఖద్దరు సిల్కు షర్టుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఆ విధంగా మహదేవన్ గారి మానవత్వం , డాక్టర్ ప్రహ్లాదు గారి మానవత్వంతో కనకట్టవటం వలన నాకు మరలా ఉద్యోగం లభించింది.

* * *

మంగళగిరిలో రియల్ ఎస్టేటు వ్యాపారం ప్రారంభించాను. శ్రీనివాస టాకీసు పక్కనే ఆఫీసు తీసుకున్నాను. పెట్టుబడి లేదు. ఏదో నా దగ్గర ఉన్న చిల్లర డబ్బులతో ఆఫీసుకు అడ్వాన్సు ఇచ్చి తీసుకున్నానే గాని భూమి కొంటానికి డబ్బు లేదు. బిట్ర వీరనారాయణ, కత్తిక పూర్ణచంద్రరావు, పిడికిటి రత్నభూషణ్ అనే పెద్ద మనుషులు వారి భూమిని కేవలం నోటిమాట మీద నాకు ఇచ్చారు.

కృష్ణాజిల్లాలో నాకు ఇద్దరు ఏజెంట్సు ఉండేవారు. నమ్మకంతో నాకు కస్టమర్సును పరిచయం చేసి వారి చేత డబ్బు కట్టించేవారు. మొత్తం మీద రెండేళ్లు ఆ విధంగా లక్షల రూపాయల వ్యాపారం చేసాను. చ.గ. వంద రూపాయలకు నేను ఆనాడు అమ్మిన ప్లాటులు ఈరోజు చ.గ. రూ. 30,000/– పోతుంది. ఏది ఏమైనా (ఎవరి అవసరం వారిది అనుకున్నప్పటికీ) ఐదుగురి మానవత్వం నాకు ఆనాడు ఉపయోగ పడింది.

* * *

రెండేళ్ల క్రితం సంగతి. రియల్ ఎస్టేటు బిజినెస్ కొద్దిగా ఉంది. మిత్రుడు తేళ్ల శ్రీనివాసుకు మెసేజ్ చేసాను. ఒక ప్లాటు అమ్మకానికి ఉంది, ఎవరైనా





తెలిసిన వారికి చెప్పమని ఆ మెసేజ్ సారాంశం. ఎందుకో ఆయనే తీసుకుంటే బాగుంటుందని ఆ మెసేజ్ పెట్టాను. కాని డైరెక్టుగా అడగడం బాగోదని అడగలేదు. ఎందుకంటె అప్పటికి నెల క్రితం నా వద్ద ఒక ప్లాటు కొనుగోలు చేసాడాయన.

నేను అనుకున్నట్లుగానే మెసేజ్ అందగానే వెంటనే ఫోన్ చేసాడాయన "హైదరాబాదులో ఎవ్వరూ అంతగా ఇంట్రస్టు చూపించడం లేదు. ఇప్పుడు మనం ఎవరినడిగినా ఉపయోగం ఉండదు. మీకు అంతగా డబ్బు అవసరమైతే నేనే కొంటాను. ఇప్పుడు లక్ష పంపిస్తాను. నెల తర్వాత మిగిలిన పైకం ఇచ్చి ప్లాటు రిజిష్టరు చేయించుకుంటాను". శ్రీనివాస్ గారు చెప్పిన మాటలకు రిలాక్సుగా ఫీలయ్యాను. నేను సరేనని ఒప్పుకున్నాను. అదే రోజు మధ్యాహ్నం ఆయన మేనేజరు ఖలీల్ లక్ష రూపాయలు తెచ్చి నాకు ఇచ్చి వెళ్లాడు. ఆ ప్లాటు శ్రీనివాస్ గారు వారి బంధువులకు కానుకగా ఇచ్చి వారి పేరుమీదే రిజిష్టరు చేయించుకున్నారు. నిజం చెప్పాలంటే శ్రీనివాస్ గారు ఇంత వరకూ ఆ ప్లాటు చూడనే లేదు. ఇందులో నా సమర్ధత ఏముంది? మానవ ప్రయత్నం చేసాను అంతే.

శ్రీనివాసు గారు కేవలం నాకు ఉపయోగ పడాలనే నా వద్ద ప్లాటు కొనుగోలు చేసారన్నది నిర్వివాదాంశం. ప్లాటు కోసం డబ్బులిచ్చాడు గాని ఊరికే ఇవ్వలేదుగా అని పాఠకులు ఎవరైనా అడగవచ్చును. అసలు ఊరికనే ఇవ్వాలనే ఆలోచన ఎందుకు? ముందుగా చెప్పుకున్నట్లుగా ఏదో ఒక లావా దేవి లేకుండా ఎవరైనా, దేనికైనా, ఎందుకు స్పందిస్తారు? ఈ లావాదేవీలో ఇచ్చిపుచ్చుకోవటాలున్నప్పటికీ, ప్రధాన ఆధారం శ్రీనివాసు గారి మానవత్వమే!

* * *

యార్లగడ్డ రజని అనే ఆమె నన్ను పరిచయం చేసి పెద్ద కంపెనీ ప్రగతి రిసార్టుకు వైస్ ప్రెసిడెంటుగా నేను పని చేయటానికి కారణమయింది. ఈమెతో నాకు పూర్వ పరిచయం కూడా లేదు. యాజమాన్యం కూడా నా పట్ల చాలా ప్రేమాభిమానాలు కనబరిచారు.

* * *

రాజమండ్రి నుండి వాళ్లు కారులో హైదరాబాదు వెళ్తున్నారు. ముందుగా ఫోన్‌లో మాట్లాడుకుని నేను సత్తుపల్లిలో అదే కారు ఎక్కాను. మిత్రుడు శేషగిరి రావు కూడా ఆ కారులో ఉన్నందున నాకు లిఫ్టు దొరికింది. ఆ కారులో ఉన్న ఒక రిసార్ట్సు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకుమార్‌తో మాట కలిసింది. ఆయన ఆసక్తిగా అడిగిన అనేక ప్రశ్నలకు అంతకంటె ఆసక్తిగా జవాబులు విశ్లేషించాను. అంతా వ్యాపారం గురించే! తెల్లవారి హైదరాబాదు చేరేవరకు మేము మాట్లాడుకుంటూనే ఉన్నాము. అంటే షుమారు ఐదు గంటలు. నేను వారి కంపెనీలో చేరాలని ముందుగానే నిర్ణయించుకుని ఆ రాత్రి ఆ విధంగా వారితో ప్రయాణించాను.

విజయకుమార్ వారి యం.డి. బాలచందర్‌తో మాట్లాడి నాకు కూడా వారి కంపెనీలో పనిచేసే అవకాశం కల్పించాడు. మొత్తం వాళ్లు ఐదుగురు డైరెక్టర్లు. నన్ను డైరెక్టర్ హెచ్.ఆర్. అండ్ పబ్లిసిటి గా నియమించి వారితో సరి సమానంగా గౌరవించి ఆదరించారు. షుమారు రెండు సంవత్సరాలు మా వ్యాపార స్నేహం కొనసాగింది. నేను కూడా నా వంతు కర్తవ్యం నిర్వహించాను. షుమారు 200 లకు పైగా కంపెనీ మార్కెటింగ్ శిక్షణా సభలలో పాల్గొని, చెప్పిన విషయం తిరిగి రెండోసారి చెప్పకుండా 200 పర్యాయాలు మార్కెటింగ్ సిబ్బందికి ఉపయోగ పడే సరికొత్త మెళకువలు బోధించాను. సృజనాత్మకమైన ప్రకటనలు





రూపొందించి, అనేక విధములైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, షుమారు 10,000ల మంది మార్కెటింగ్ సిబ్బంది కమీషన్ పద్ధతిపై నియామకం గావటానికి తోడ్పడ్డాను. కాల గమనంలో శాశ్వతం అంటూ ఏమీ ఉండదు గావున రెండేళ్లు పని చేసాక అక్కడ రిజైన్ చేసి నేను తప్పుకున్నాను. ***ఈ మొత్తం వృత్తాంతంలో నా సమర్థత ఉన్నట్లు పైకి కన్పిస్తున్నప్పటికీ, కారు ప్రయాణ సంభాషణ నా ప్రయత్నానికీ, కొలువులో ఉండగా నేను చేసినదంతా నా కర్తవ్య నిర్వహణక్రిందకు వస్తాయి.*** నన్ను పరిచయం చేసిన విజయకుమార్ మానవత్వంతో పాటు యం.డి. బాలచందర్ మానవత్వం కనెక్టయి నాకు ఒక అవకాశం లభించిందన్న విషయమే ఇందులో కీలక అంశం.

* * *

అంతే గాక నన్ను డైరెక్టర్‌గా తమ కంపెనీలో నియమిచుకున్న శ్రీ చంద్ర ప్రసాదు, శ్రీ సుబ్బారెడ్డి, శ్రీ పురుషోత్తమ నాయుడు. శ్రీ జయప్రసాదు రాజా మరియు శ్రీ శ్రీనివాసు గార్లు అందరూ మానవత కారణంగానే నాకు అవకాశం ఇచ్చారని భావిస్తున్నాను.

* * *

ఇలా చెప్పుకుంటూ వెళితే ఈ రోజు వరకు నా జీవితమంతా అద్భుతమైన సంఘటనలే. అలాగని చేదు సంఘటనలు కూడా ఎక్కువ గానే ఉంటాయి. ***నా జీవితమంతా సంఘర్షణే. నిజానికి సంఘర్షణ నన్ను నీడలా వెంటాడుతూనే ఉంటుంది. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ! నిరంతరం అనుభవమవుతూనే ఉంది. దాన్ని చూసాక నా అన్వేషణ ప్రారంభమయ్యింది. అందులోనుండి నాకు సంతోషం లభించింది. కావున నా జీవితం సంఘర్షణ, అన్వేషణ, సంతోషం-అనే మూడు అంశాలతో ముప్పేట గొలుసులా సాగిపోతూనే ఉంది. సంఘర్షణ ప్రారబ్ధ కర్మ కాగా, అన్వేషణ నా యొక్క ఆగామి కర్మ, ఫలితం***

***సంతోషం. నిరంతరాన్వేషణే నా విజయ రహస్యం.*** ఎవరి జీవితంలో నైనా సంతోష విషాదాలు రెండూ ఉంటాయి. విషాదాలు మనం నేర్చుకోవటానికి కావున అవి మనతోనే ఉండాలి. విజయ గాథలు ఇతరులకు స్ఫూర్తినిస్తాయి. కాబట్టి వాటి గురించి మాత్రమే చెప్పాలి.

ఈ పుస్తకం రాస్తున్న సమయంలోనే మిత్రుడు సుందరం సమర్ధత, తెలివి తేటలు గురించి నాతో మాట్లాడాడు. ఆ సంభాషణ ఫలితంగానే కొన్నైనా నా జ్ఞాపకాలు రాసి సమర్ధత అనే పదానికి పెద్ద విలువ లేదని చెప్పాలనిపించింది. ***సమర్ధత అనేది అహం సృష్టించిన భావమే గాని వేరొకటి గాదు.***

నేను పెద్ద తెలివితేటలు గలవాడిని కాను. లౌక్యం అసలు లేదు. సమర్ధత అనే దానిమీద నాకు నమ్మకమే లేదు. జన సహకారమే అభివృద్ధికి మూలం. జన సహకారం సద్యోస్ఫురణ వలన ఒనగూడుతుంది. సద్యోస్ఫురణ కేవలం సాత్విక పరోపకార కర్మల వలన అభివృద్ధి చెందుతుంది. సద్యోస్ఫురణ అంటే సకాలంలో సవ్యమైన ఆలోచన.

నాకు సమర్ధత ఉందని నలుగురికి అనిపించటం వలన నేను సమర్థుడిగా రాణించగలిగాను. మంచి తెలివిగలవాడినని పది మంది అభిప్రాయపడ్డారు గావున తెలివిగలవాడిగా చలామణి అయ్యాను. లక్ష్మీదేవికి నామీద పుత్రవాత్సల్యం కల్గిందో ఏమో నన్ను చల్లగా చూసి ధనవర్షం కురిపించింది. కొంచెం జాగర్త పరుడిని గాబట్టి ఎప్పుడూ వర్షాలు పడతాయని ప్రలోభ పడకుండా ఇంకుడు గుంత తీసి నీళ్లు కొన్ని మళ్లించాను. సమాజంలో ఉన్న ఎంతో మంది సమయానుకూలంగా తలా ఒక చేయి వేసినందు వలన ఇలా మీ అందరి ముందూ ప్రయోజకునిగా నిలబడ్డాను. ***ఈ మొత్తం పరిణామం వెనుక నేను చేసిందంటూ ఏదయినా ఉందంటే, కేవలం అదే విధమైన మానవతాదృక్పథంతో నేను అనేక మందికి తోడ్పడ్డాను. నేను ఎవ్వరినీ పరోక్షంగా నిందించను. నాకు***





***అసౌకర్యంగా ఉందంటే మౌనంగా ఉంటూ వారితో మాట్లాడకుండా నా పనేదో నేను చూసుకుంటాను. నేను ఎవరి గురించి ఐనా ఆలోచించాను అంటే నేను సాయం చేయగల్గింది ఏమైనా ఉందా అని మాత్రమే. అందరి పట్లా ప్రేమగా ఉండండి, మిమ్మల్ని మీరు ఆత్మ విమర్శచేసుకుంటూ పరిణితి చెందండి అనే సూత్రాన్ని నేను నమ్ముతాను, ఆచరిస్తున్నాను.***

నోరు మంచిదయితో ఊరు మంచిదవుతుందనే సామెత నా జీవిత పుస్తకంలో ఒక అధ్యాయం. అంతా మనమంచికే అనే సామెత మరొక అధ్యాయం. ఓరిస్తే ఓరుగల్లు పట్టణమవుతుందనే సామెత వేరొక అధ్యాయం. మన్ను మూల పదార్థం, కుండ వస్తువు. మట్టితో కుండ తయారుచేయగలము గాని, కుండతో మట్టి తయారు చేయలేము. కుండ లేకున్నా మట్టి ఉంటుంది. మట్టి లేకుండా కుండ ఉండదు. ***ఆత్మ జ్ఞాన పుస్తకాలలో ఉటంకించే ఈ ఉదాహరణ ఇక్కడ నేను ఎందుకు చెబుతున్నానంటే, - "సమర్ధత, లౌక్యం, ప్రతిభ, తెలివి సృజనాత్మకత, ఇంకా ఇతర నైపుణ్యాలు" రకరకాల ఆకారాలతో అందంగా కన్పించే కుండలు. వీటి వెనుక ఉన్నది సత్కర్మలు అనే "మట్టి" మూల పదార్థం.***

చివరి మాట. కర్మసిద్ధాంతం అంటే పెద్ద కష్టమైనది ఏమీ కాదండి. మీరు మంచి చేస్తే మీకు మంచి లభిస్తుంది. ఈ పుస్తకం చదివిన మీరు ఆగామి కర్మగా మంచిని మాత్రమే చేస్తారని నేను విశ్వసిస్తున్నాను.

**సర్వేజనా సుఖినోభవంతు**

**శుభం**

## Niya and Nihal Resorts


Mr. Chandika Sambasiva Rao believes that Dharmik Jeevan (Life of Morals & Ethics) is essential to lead a fruitful life. He observed that several socio-economic agitations are developing every day in the current society and opined that a Resort with comfort and harmony but more importantly with a spiritual essence is necessary for exhausted minds. Most Resorts in India offer worldly pleasures but there are no spiritual Resorts. Hence he wants to start Niya and Nihal Resorts with all required amenities in Tirupathi to disseminate Satwa Guna (Purity of Mind).

Annual Darshan of Lord Venkateshwara will eliminate all known and unknown human sins and purify the mind. Though there are several resorts available in India, all invariably focus on recreation and materialistic pleasures. However Mr. Chandika Sambasiva Rao realized that a spiritual essence combined with comfort and peace is essential for the dissemination of Satwa Gunam (Purity of Mind). It is this Satwa Gunam that makes a person pure, free from diseases and tensions thus developing a sattwic mind which is the first stage of spiritual realization. Hence he wants to start Niya and Nihal Resorts in Tirupathi, Andhra Pradesh, India.

The ancient sages used to call Bharata Desam Divyadhatri and Karma Bhoomi. After fulfilling karma (deeds), every human being has to aspire for Moksha (salvation), which is possible with Aadyatmika Chintana (Spiritual Meditation) and it can be practised by becoming a member of spiritual resorts like our Niya and Nihal Resorts.

**NOTE : INTERESTED IN THIS CONCEPT MAY START CORRESPONDENCE TO : E-Mail : niyaandnihal@gmail.com**


## Facilities & Services


Tirumala Temple


A/C.Rooms



Restaurant



Conference / Function Hall



Vedapurohith Blessings


Yagnasala


Gosala


Swimming Pool


Gardens & Childrens Park


Senior Citizens Paradise